శ్రీరామచంద్ర గ్రంథమాల — సప్తమ పుష్పము

శ్రీ సద్గురు వాసుదేవ పరబ్రహ్మణేనమః

# శ్రీ సద్గురు స్తవరాజము

అను

# చిత్రబోధ ప్రబంధము.



బ్రహ్మశ్రీ కూచి సత్యనారాయణశాస్త్రి గారిచే

నారురుక్షులకు మోక్షద్వారకవాటభేదకంబుగా రచింపఁబడి

శ్రీశ్రీశ్రీ జగద్గురు రెడ్డి వెంకట సుబ్రహ్మణ్య గురువర్యుల ప్రియశిష్యులగు

డాక్టరు కందర్ప సూర్యనారాయణ, బి. ఏ., (హోమియో)

గారి సహాయమున ముద్రింపఁబడియె.

కాపీరైటు]

[వెల రు 1-8-0

శ్రీరామచంద్ర గ్రంథమాల — సప్తమ పుష్పము

శ్రీ సద్గురు వాసుదేవ పరబ్రహ్మణేనమః

# శ్రీ సద్గురు స్తవరాజము

అను

## చిత్రబోధ ప్రబంధము.



బ్రహ్మశ్రీ కూచి సత్యనారాయణశాస్త్రి గారిచే

నారురుక్షులకు మోక్షద్వారకవాటభేదకంబుగా రచింపఁబడి

శ్రీశ్రీశ్రీ జగద్గురు రెడ్డి వెంకట సుబ్రహ్మణ్య గురువర్యుల ప్రియశిష్యులగు

డాక్టరు కందర్ప సూర్యనారాయణ, బి. ఏ., (హోమియో)

గారి సహాయమున ముద్రింపఁబడియె.

కాపీరైటు]

[వెల రు 1–8–0

బ్రహ్మశ్రీ రెడ్డి వెంకటసూర్యనారాయణ
పరబ్రహ్మంగారికి—

కూచి సత్యనారాయణశాస్త్రి వ్రాసి యిచ్చినది.

అయ్యా!

నాచే రచింపఁబడిన "శ్రీ సద్గురు స్తవరాజము" అను గ్రంథమును ముద్రించి ప్రకటించుటకు మీకు సర్వాధికారములు ఇచ్చుచున్నాను.

దంగేరు
10—12—47

ఇట్లు
కూచి సత్యనారాయణశాస్త్రిప్రాలు.

అన్ని హక్కులు— రెడ్డి వెంకటసూర్యనారాయణపరబ్రహ్మంగారివి. కాపీరైటు.

★

అవంతీ ప్రెస్ - రాజమండ్రి.
ఇ. జి. 91. కాపీలు 500.

# పండితాభిప్రాయములు

జటావల్లభుల పురుషోత్తము ఎం. ఏ.
ప్రిన్సిపల్, సంస్కృతకళాశాల,
కొవ్వూరు - తూ. గో. జిల్లా

శ్రీ కూచి సత్యనారాయణశాస్త్రిగారిచే రచింపఁబడిన "సద్గురుస్తవరాజ" మను గ్రంథమును స్థాలీపులాకన్యాయముగాఁ జూచినాను. ఆధ్యాత్మికానుభూతి శిఖరము నధివసించిన యొక మహాపురుషుఁ డిందు వర్ణ్యుఁడగుటచే నీగ్రంథము పాఠకజనపావనమై యలరారుచున్నది. ఇందలి భాష సరళము. నిర్దుష్టము. కవితాధార యనర్గళము, మృదుమధురము. ఇది సకలాంధ్రాళి మోదము నొదవించునని తలచుచున్నాను.

17—12—47

ఇట్లు
జటావల్లభుల పురుషోత్తము ఎం. ఏ.

**K. Satyanarayana**, M. A., L. T.,
Principal,
Govt. Training College,

22-12-1947
RAJAHMUNDRY.

శ్రీ కూచి సత్యనారాయణశాస్త్రిగారు రచించిన "శ్రీ సద్గురుస్తవరాజము" అనుగ్రంథము నచ్చటచ్చట చదివితిని. ఇందలి విషయము చాల గొప్పది. మహాత్ములగు గురుదేవుల సన్నిధిని వారు పొందిన యాధ్యాత్మిక పరిణామముల ఫలమే యీగ్రంథము. వాఙ్మనోతీతమగు పరతత్త్వవిషయమును సద్గురు కృపావిశేషమున కరతలామలకముగ సులభశైలిని వ్యక్తీకరించి ముముక్షుజనాదరణగౌరవపాత్రత గను నీ విద్వత్కృతులు ఎంతయు ప్రశంసాపాత్రములు.

ఇట్లు
కేశిరాజు సత్యనారాయణ.

అనిపెద్ది జగన్నాథశాస్త్రి, కొవ్వూరు, ప॥గో.
ఆంధ్ర పండితుడు, బోర్డుహైస్కూలు 23—12—1947

బ్రహ్మశ్రీ కూచి సత్యనారాయణశాస్త్రిగారిచే రచియింపబడిన శ్రీ సద్గురు స్తవరాజమను నేకాశ్వాసగ్రంథము నామూలాగ్రముగఁ దిలకించితిని. ఇతివృత్తమా! ప్రాచీనసాంప్రదాయావలంబకులగు సద్గురురాజయోగుల తురీయపురుషార్థప్రబోధము. రచనాపద్ధతియా! నిరర్గళధారాశుద్ధిబద్ధమై పూర్వకవితాధూర్వహుల సర్వవిధములఁ దలపించుచున్నది. గురుశిష్యసంవాదరూపమగు నిట్టి వేదాంతవిషయమును, దెలుగుపద్యములలో నిట్లు చిత్రించిన యీ నిరవద్యకృతి, సీతారామాంజనేయకృతికిం బ్రతికృతియై, కృతార్థతం బడసి కవిగారికిం గృతిత్వమాపాదించిన దనుటకు సందియంబు లేదు. ఇందలి భాగవతకథాంతరార్థనిర్వచనభాగములును, దారకలక్ష్యప్రదర్శనపద్ధతులును, ముముక్షుజనాహ్లాదకరములై కరము విరాజిల్లుచున్నయవి. కవిగారి కవితాశక్తి గురుభక్తితో భూషణభూష్యభావము నంగీకరించుచున్నది.

ఇట్లు
అనిపెద్ది జగన్నాథశాస్త్రి.

ఉభయభాషాప్రవీణ మకాం
లింగాల సూర్యనారాయణ రాజమండ్రి,
22—12—47

బ్రహ్మశ్రీ కూచి సత్యనారాయణశాస్త్రి కవీంద్రకృత "శ్రీ సద్గురు స్తవరాజమ్ము" దిలకించి యానందపరవశుఁడనై గాఢమగు నిట్టూర్పు విడిచితిని. కవితావాహినీజన్మశైలమనఁదగు నీకవిచంద్రునిరచనావిశేషములు ప్రతిరక్తకణమందును జిత్రితములై నూతనచైతన్యమును గల్గించుచున్నవి. "పుణ్యశ్లోకస్యచరితముదాహరణమర్హతి" అనునుడి యీకవిపుంగవునియెడల సార్థకమైనది. అవతారపురుషమహిమాన్వితులును, రాజయోగసామ్రాజ్యాభిషిక్తులును నగు శ్రీశ్రీశ్రీ జగద్గురు సుబ్రహ్మణ్యగురువర్యుల బాల్యాదికమును, బోధనవిశేషములను, సహజసిద్ధముగఁ దన మృదుమధురకవితారూపమునఁ జిత్రించి యీకవిపుంగవుఁడు తనజన్మమును సార్థకము చేసికొనియె. సత్యపద్ధతిపై నడచిన ప్రాచీనగురుకులసంప్రదాయములు నశించి యథార్థాభ్యుదయమార్గములు కుంటువడుచున్న యీరోజులలో విద్యార్థుల మనఃప్రవృత్తులను మంచిమార్గములకుఁ ద్రిప్పఁగల యీగ్రంథరాజమును విశ్వవిద్యాలయములు మున్నగు విద్యాసంస్థలును, గ్రంథాలయములును, ఆదరాభిమానములతో స్వాగతమిచ్చి గౌరవింపఁ గలవని నమ్ముచున్నాను.

ఇట్లు
లింగాల సూర్యనారాయణ.

# శ్రీ శ్రీ శ్రీ జగద్గురు సుబ్రహ్మణ్య యోగీంద్రులు

జననము : రౌద్రినామ సం॥ర జ్యేష్ఠ శుద్ధ చతుర్థీ గురువారము. (26-5-1860)



శ్లో॥ పరిత్రాణాయ సాధూనాం । వినాశాయచ దుష్కృతాం

ధర్మసంస్థాపనార్థాయ । సంభవామి యుగేయుగే॥ —భగవద్గీత.

శ్రీరస్తు

శ్రీ బాలాంబాసమేత శ్రీ శ్రీ సుబ్రహ్మణ్య సద్గురుపరబ్రహ్మణేనమః

# తొలిపలుకు

శ్లో. గురుర్బ్రహ్మ గురుర్విష్ణు । ర్గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్పరం బ్రహ్మ । తస్మై శ్రీ గురవే నమః॥

శ్లో. గుకారశ్చాంధకారస్తు । రుకారస్తన్నిరోధకృత్
అంధకార వినాశిత్వా । ద్గురురిత్యభిధీయతే॥

శ్లో. సర్వశ్రుతి శిరోరత్న । నీరాజిత పదాంబుజమ్
వేదాన్తార్థప్రవక్తారం । తస్మాత్సంపూజయే ద్గురుమ్॥

అశేష శేముషీ జగజ్జేగీయమానమైన భారతవర్షంబునకు బ్రహ్మవిద్యయే ప్రాణము. అట్టి పవిత్రభారతదేశము నేడు బ్రహ్మవిద్యాపరాఙ్ముఖమై విషయానందమే పరమావధిగా నెంచిన పాశ్చాత్యసాంప్రదాయముల కలవడి మతిచెడి యల్లలాడుచున్నది. కాని ధర్మరక్షణ బిరుదాంకితుండైన యాపరబ్రహ్మ,

"యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్"

అను వాక్యమును వ్యర్థము సేయునా! పరమపూజ్యులగు శ్రీ శ్రీ శ్రీ సుబ్రహ్మణ్యగురువరేణ్యుల బోధాలహరిలోని యే ఘట్టమొకించుక తిలకించినను ఇమ్మహనీయులు జగత్ప్రభుని లీలావతారమేయని విదితమగును. ఇమ్మహనీయులు మహామహిమాన్విత జగద్గురువులగు ప్రహ్లాద నారద పరాశర పుండరీక వ్యాసాంబరీష శుకజనక యాజ్ఞవల్క్యాది గురుకూటములోని వారగుట నిస్సంశయము.

ప్రహ్లాదుని భక్తి, శ్రీశుకుని త్యాగము, వసిష్ఠుని కర్మపరత్వము నను ఇమ్మహనీయులయందు మూర్తీభవించినవి. గృహస్థాశ్రమమున గూడ భక్తి జ్ఞాన వైరాగ్యములచే ముముక్షువులు తరింపవచ్చునని యీభాగవతశిఖామణి జీవితమువలన సిద్ధాంతమగుచున్నది.

నా వంటి యల్పజ్ఞునకు ప్రౌఢరచనా బంధురమైన యిటువంటి ప్రబంధమునకుఁ దొలిపలుకు వ్రాయుట సాహసమేయైనను వేదాంతగ్రంథస్థ విషయముచే నాకర్షింపఁబడి యిందుల కుద్యమించినందులకుఁ బండితులు మన్నింతురుగాక.

శ్రీ కూచి సత్యనారాయణశాస్త్రిగారి కవిత యొక సద్గురురాజయోగి గుణగణాభివర్ణనమునకై వినియోగపడుటచే జరితార్థ నొందెను. మృదుమధురమగు శైలి, స్వభావోక్త్యలంకారము, ద్రాక్షాపాకము, సద్గురుపరంపరాగతమైన బ్రహ్మబోధ, సుబోధకముగా నిందుఁ బ్రోక్షీకరింపఁబడినవి. వేదములన్నియుఁ దల్లక్రిందులుగాఁ జదువవచ్చును. శాస్త్రములన్నియు నర్థసహితముగా నధిగమింపవచ్చును. పురాణములన్నియు వ్యాఖ్యానసహితముగాఁ బఠింపవచ్చును. కాని సమస్త వేదాన్తార్థసారమును సంగ్రహించుటకు సద్గురుసేవయే రాజమార్గము.

"మహాజనో యేన గత స్స పన్థాః" అను రీతిగా ముముక్షువులీ గ్రంథరాజముం బఠించి తరింతురుగాక.

మండపేట
రామచంద్రపురం తాలూకా
తూర్పుగోదావరి జిల్లా
29—12—47

ఇట్లు
బుధజనవిధేయుడు
కందర్ప సూర్యనారాయణ బి. ఏ.

## శ్రీ శ్రీ శ్రీ దాహాంబా సుబ్రహ్మణ్య గురుదంపతులు.



| | |
|---|---|
| జననము : | జననము : |
| 1860 సం॥రం. | 1873 సం॥రం. |

శ్రీ సద్గురు వాసుదేవ వరబ్రహ్మణేనమః

# శ్రీ సద్గురు స్తవరాజము

మ. అగజాధీశ ముఖామరప్రభులు ని • త్యారాధన ప్రౌఢి యొ
ప్పఁగ భావించుట లో నెఱింగి తను నా • బాల్యంబు ధ్యానంబుసే
యఁగ రక్తుండగు సుబ్బరాయగురు చి • త్తాంభోజమందుండి యా
జగముల్ నిండిన రామచంద్రుని పదా • బ్జంబుల్ మదిన్ నిల్పెదన్. 1

సీ. ఇరుపార్శ్వములయందు • భరతశత్రుఘ్నులు
చిఱునవ్వులొలయుంగ • సురటివిసర
వెనుకభాగమునందు • వినతుఁడై సౌమిత్రి
మౌక్తికచ్ఛత్రంబు • మౌళిఁబట్ట
వామాంకమున సంత • తామోద వికసిత
ముఖపద్మయై సీత • పొల్పుమీరఁ
బదపద్మములచెంతఁ • బవమాన తనయుండు
భక్తి నానందబా • ష్పములు గుఱియ

గీ. నగ్రభాగమునను వసి • ష్ఠాదిమునులు
సన్నుతియొనర్పఁ గనకపు • ష్పకమునందు
నమరు శ్రీరామ భక్తచి • త్తాభిరాము
హృదయమున సిల్పి విరుల న • ర్చింతునెపుడు. 2

శా. శ్రీరామాంఘ్రి సరోరుహామృతము వా • సింగ్రోలి యింద్రాదిబృం
దారాధీశులకైనఁ బొందఁగ నసా • ధ్యంబైన యానందపా
థోరాశిన్ జలకంబులాడుచుఁ బ్రబు • ద్ధుండై విరాజిల్లు సు
బ్బారాయాహ్వయ దేశికేంద్రుని పదా • బ్జంబుల్ మదిన్ నిల్పెదన్. 3

మ. పగయున్ మైత్రియులేక సంతతపర • బ్రహ్మానుభూతి స్థితిన్
జగమెల్లన్ బరమాణుమాత్రముగఁ బ్ర • జ్ఞాదృష్టి నీక్షించుచున్
దగనీభూస్థలిఁ దీర్ఘమాడలికిఁ దీ • ర్ఘంబౌచు విభ్రాజితం
డగు మాసద్గురుమూర్తిపాదములు ప్రా • పై మమ్ము రక్షించుతన్.

శా. క్షోణీధారకమై, సువర్ణరుచియై • శుంభచ్చతుష్పత్రమై,
ఘ్రాణోత్పత్తి నిదానమై గుదమునన్ • రాజల్లు నాధారమం
దేణాంకార్ధవిభూషణుండగు గణా • ధీశుం బ్రశంసించి, మ
త్ప్రాణిద్వంద్వము మోడ్చి షట్ఛతనతుల్ • భావించి యర్పించెదన్.

మ. సలిలస్థానము, రక్తవర్ణయుతమున్ • షట్పత్రదీప్తంబు న
స్థలజిహ్వేంద్రియకారణంబు నయి లింగ • ప్రాంతమందుంటె వ
ర్తిలుచున్ యోగవిశేషవేద్యమగు స్వా • ధిష్ఠానమందున్న యా
జలజోత్పన్నన కాలువేలును సమ • స్కారంబు లర్పించెదన్. 6

గీ. వహ్నిపద్మంబు దశదళ • భ్రాజితంబుఁ
బీతవర్ణంబులోచన • బీజమగుచుఁ
బొక్కిలిసిఁ గల్గు మణిపూర • మున వసించు
వాసుదేవున కాశ్వేలు • వందనములు. 7

గీ. వాయుభవనంబు, ద్వాదశ • పత్రకంబు
శ్వేతరుచియుఁ ద్వగింద్రియ • హేతువగుచు
స్వాంతసీమనుగల యనా • హతమునందుఁ
బరగు రుద్రున కాశ్వేలు • వందనములు. 8

గీ. షోడశదళంబు హరిసీల • శోభితంబు
గగననిలయంబు శ్రుతియుగ్మ • కారణంబు
నగుచుఁ గళమునఁ దగు విశు • ద్ధాబ్జమందు
నలరు జీవాత్మునకును స • హస్రనతులు. 9

గీ. ద్విదళకలితంబు, మాణిక్య • దీప్తియుతము,
సలలితాంతఃకరణ నిజ • స్థలమునైన
భ్రూలతామధ్యశాజ్ఞాస • రోజమందు
నమరు పరమాత్మునకును స • హస్రనతులు. 10

ఉ. సారసహస్రసంఖ్య దళ • సంయుతమై రవికోటి దీప్తు లే
పారఁగ బ్రహ్మరంధ్రమును, నంటుచు ధీలయహేతువౌ సహ
స్రారసరోజమందుఁ దనఁ • రారెడు శ్రీగురు వాసుదేవుసద్
ధారణఁజేసి భక్తినిఁ బ్ర • ణామసహస్రము నప్పగించెదన్. 11

వ. అని యిట్లు సకలేష్టదైవత నమస్కారంబు లాచరించి, నిశ్చల ధ్యాన నిమీలిత లోచనుండనై, దుస్తరసంసారపారావారసముత్తారణంబును, నఖండానందసంధానకారణంబును నగు నొక్క సత్ప్రబంధంబు నిర్మింపంబూనియున్న సమయంబునం జంద్రోదయారంభసముజ్జృంభమాణంబు నంభోరాశిచందంబున మదీయాంతరంగంబు నుప్పొంగం జేయుచు. 12

సీ. సర్వాంగముల సము • జ్వలభంగిఁ దీర్చిన
భస్మంబు రుద్రరూ • పంబుఁ దెల్ప
గళమున విలసిల్లు • తులసి మాలికలు శ్రీ
వాసుదేవాంశ వై • భవముఁ దెల్ప
నపరవేదంబులై • యవతరించెడు మహా
వాక్యముల్ బ్రహ్మసం • పత్తిఁ దెల్ప
శాంభవీముద్రా వి • శాలనేత్ర యుగంబు
పంచభూతాభావ • పదవిఁ దెల్ప

గీ. ముక్తిశైలాధిరూఢులై • భక్తవరులు
చెంతగొల్వంగ బృందావ • నాంతరమున

సుముఖులై యున్నయట్టి శ్రీ • సుబ్బరాయ
సద్గురుస్వామి మదికి సా • క్షాత్కరించె. 13

వ. ఇట్లు సాక్షాత్కరించిన దేశికేంద్రుని పాదారవిందంబులకు నానంద బాష్పాభిషేకంబుతోడ సాష్టాంగదండప్రణామంబు లాచరించి హృదయంబున నమ్మహానుభావుననుభావంబు వేవిధంబులం బ్రశంసింపుచు నిట్లని వితర్కించితి. 14

సీ. పగలెల్ల నుపనిష • త్పరమవాక్కులుగాని
వ్యవహారవచన మొం • డైనరాదు
నిశలెల్ల విష్ణు వ • ర్ణించు స్వప్నమెకాని
ప్రకృతిప్రభావ మే • పాటిలేదు
అరగన్నుమూయ బ్ర • హ్మ వ్యాప్తియేగాని
విషయవాసనలు వ్యా • పింపఁబోవు
పంచేంద్రియంబులు • పని సేయునేగాని
యాత్మనవీక్షి యొం • డైనరాదు
గీ. అహహ! యీసద్గురుస్వామి • యవిరతంబు
నాత్మగాఁడై యుండుఁగాని దే • హంబు తనకు
నుండెననుమాట జ్ఞప్తియే • యుండఁబోదు
ఉండునేమొ! దినాన కొ • క్కొక్కమాఱు. 15

సీ. ప్రోది భక్తులకట్టె • బోధించి బోధించి
యొకమాఱు కనుమూసి • యుదధిమునుఁగు
వాసుదేవచరిత్ర • వర్ణించి వర్ణించి
కన్నుల బాష్పోద • కములు నించుఁ
బరిపూర్ణతత్వంబు • భావించి భావించి
చదలంటి యట్టహా • సంబుసేయు

సాంఖ్యవిచారంబు • సంధించి సంధించి
తనువెల్లఁ బులకయు • క్తంబొసర్చు

గీ. శైశవాదిగ నిల్లు ని • శ్చలితభంగి
సద్వయానంద నిస్తరం • గాబ్ధియందు
నోలలాడెడు గురుమూర్తి • సుషమఁ జెప్ప
నుర్వి నెవ్వఁడు శ్రీశుకుం • డొకఁడు దక్క. 16

సీ. ఐదేండ్ల లేఁబ్రాయ • మాదిగా శ్రీరామ
భక్తి నానందబా • ష్పములు నించి
చిత్రవిగ్రహములఁ • జేసి రామాయణం
బంత నాటకభంగి • నాటలాడి
భూసభాంతరమెల్లఁ • బూనిన శ్రీరామ
శతకోటి మానసా • ర్చనమొనర్చి
యుదయాస్తమయముల • నూహ నెఱుంగక
గురుపదాంబుజముల • గుఱుతుఁ బూని

గీ. పండ్లుదిని కొండగుహలందు • నేండ్లకొలఁది
సచ్చిదానంద పరిపూర్ణ • సత్త్వుఁడగుచుఁ
జొక్కి చరియించునట్టి శ్రీ • సుబ్బరాయ
సద్గురుస్వామి చరణాంబు • జముల గొల్చు
భాగ్యమబ్బుట బహుతపః • ఫలముగాదె. 17

సీ. పైగాలిసోకినఁ • బ్రకట చరాచర
జంతుజాలములు దో • షంబులణఁగు
మొగముచూచినతోడ • మృగసంతతులకైనఁ
గామాది వైరివ • ర్గంబు తొలఁగుఁ
గరుణాకటాక్షవీ • క్షణముఁ జల్లినమాత్ర
దుష్టులకైన స • ద్గుణములబ్బు

పెదవి విప్పినతోడఁ • బదునాల్గు భువనంబు
తెలమి బ్రహ్మానంద • జలధిమునుఁగుఁ

గీ. బ్రాహ్మతత్త్వంబు రూపింపఁ • బుడమి వెలయు
నపరకృష్ణావతారమో • యనఁగ నొప్పు
సద్గురుస్వామి నిజమహి • మంబుఁ దెలియఁ
దగమె! షట్చక్రమర్మవే • త్తలకునైన. 18

గీ. అంచు "నగురోరధిక" మంచు • గొందఱిలను
"నాస్తితత్త్వం గురోఃపర" • మ్మనుచుఁ గొంద
ఱానతిచ్చిరిగాదె త • త్త్వార్థవిదులు
గానఁ దత్త్వంబు గురుమూర్తి • కన్నఁ గలదె. 19

వ. ఇట్టి యుత్తమోత్తమంబునుం బరమపవిత్రంబునైన పాత్రంబు బహు
జన్మకృత సుకృతపరిపాక విశేషంబున లభియించుచుండ నన్యదీయ
హేయచరిత్రంబు లభివర్ణించుటయు, నాకర్ణించుటయు, ననన్యసాధా
రణంబైన సుధాపాత్రంబు ముంజేతికందుచుండ నీరసపానీయంబు
నాసించుటవంటిదిగా నెఱింగి యనంతకల్యాణగుణాకరుండగు శ్రీగురు
వాసుదేవుని విజ్ఞానవిలాసంబు సద్గురుస్తవరాజంబను పేర ననుసంధించి
తదిష్టదైవతంబైన శ్రీరామచంద్రపరబ్రహ్మంబున కంకితంబుగా సమ
ర్పింప నిశ్చయించితి. 20

### షష్ఠ్యంతములు

లయగ్రాహి. రామునకు కల్మషవి • రామునకు భానుకుల
సోమునకు దైత్యగణ • భీమునకు శౌర్యో
ద్దామునకు శాంతిగుణ • ధామునకు భావనసు
నామునకు దీప్తసుమ • దామునకు నాత్మా
రామునకు రూపజిత • కామునకు సన్నిహిత
కామునకు దివ్యనుత • నామునకు మేఘ

శ్యామునకుఁ జిత్తగత • సామునకు ధైర్యగుణ
సీమునకు భూవరల • లాముసకుఁ బ్రీతిఁ. 21

వ. సమర్పణంబగు నేతత్ప్రబంధమునకుం గథానుబంధం బెట్టిదనిన. 22

సీ. ఎవ్వాని యవతార • మిలలోన విలసిల్ల
భృగువిష్ణుతేజంబు • లేకమయ్యె
నెవ్వాని గురుఁడాగ్ర • హించి మన్నిగమంబుఁ
దెమ్మన్న విద్యాన • లమ్ముఁ గ్రక్కె
నేవాఁడు మార్తాండు • సేవించి ఘనచతు
ష్షష్టి విద్యలనెల్ల • సంగ్రహించె
నెవ్వాఁడు ద్వైతులై • మొసఁగు మానులనెల్ల
నద్వైతబోధచే • నణఁచిమించె

గీ. మునులు వేవురు సభనుండ • మొనసి జనక
భూపతికిమున్న పరిపూర్ణ • బోధసేయఁ
బణముఁ జేపట్టి వానిక • ప్పరమవిద్య
నోసఁగి రక్షించినట్టి య • య్యసదృశుండు
యాజ్ఞవల్క్యుండు గలఁడు లో • కైకగురుఁడు. 23

కం. ఆతని మహిమలు వాకొన
వాతాశనపతి సహస్ర • వదనములైనన్
భీతిల్లు ననఁగ నాకిఁక
నాతతముగఁ జెప్ప శక్య • మగునా! తలఁపన్. 24

శా. వైశంపాయను నాజ్ఞచే జనకభూ • పాలుఁడు బహుప్రీతితో
నాశీర్వాద మొసర్ప నేగ జనకుం • డచ్చోటలేకున్న ధా
త్రీశస్థానమునం దధక్షితల స • ర్థిం జల్లగాఁ జిత్రవ
ల్లీసంఘంబు సజీవమై పెరిఁగి లా • విత్యంబుతోఁ బల్లవ
శ్రీసంధిల్లఁగఁ బూచి సత్ఫలములన్ జె • న్నొందె సుబంబుగన్. 25

చ. జనపతు లాచరించు నయ • శాసన ధర్మములన్ వచించె స
జ్జనులొనరించు వైదిక వి • ధానములన్ నిగదించె నాతపో
ధనులునటించు యోగవిధి • తంత్రములన్ బ్రకటించె జ్ఞానలో
చనుఁడగు యాజ్ఞవల్క్యముని • చంద్రునితో నొకరుండు సాటియే. 26

కం. యతియై పంచశిఖుండన
నతిపావనగతి మెలంగి • యఖిలమునీంద్ర
ప్రతతికి నిజపరమార్థ
స్థితిఁ దెల్పి కృతార్థమతుల • జేసెన్ బ్రీతిన్. 27

గీ. అమ్మహాభాగుఁ డొనరించు • నట్టిసూత్ర
కల్పపద్ధతి యజనాది • కర్మపట్ల
నిరతిచే మించి మిగుల సు • స్థిరతఁ గాంచె
గేయతరరేఖ వాజస • నేయశాఖ. 28

గీ. వెలయు నాశాఖయందు స • ద్విమల యశుఁడు
నవిరతాధ్యాత్మరామాయ • ణాదిపఠన
సక్తుఁ డురువేదమాత్రుకా • జపపరుండు
నన్నదానపరుండు బ్ర • హ్మన్నశాస్త్రి. 29

చ. అనృతములాడలేదు మఱి • యన్యులదూరఁగలేదు దైత్యసూ
దనపదభక్తి నెన్నఁడును • దప్పిచరింపఁగలేదు సాధుస
జ్జనులయెడన్ గడున్ వినయ • సంపదఁ బాయఁగలేదు పట్టిచూ
చిన సనముందు భాగవత • శేఖరుఁడమ్మహనీయుఁ డల్పుఁడే. 30

గీ. అమ్మహాత్మున కనురూప • యైన ధర్మ
పత్నియందుఁ గుమారస • ప్తకము గలిగె
వారిలో నద్వితీయుమై • వన్నె కెక్కు
రత్న మా హారమున దివ్య • రత్నమయ్యె. 31

ఉ. కర్దమదేవహూతులధి • కంబగు దివ్యతపం బొనర్చి సా
హార్దమువీరఁగాఁ గపిలు • నాత్మజుగాఁ గనునట్లు దైత్యస
మ్మర్దను వాసుదేవునిఁ గు • మారునిగా వసుదేవదేవకుల్
దుర్దశవోవఁ గన్నటులఁ • దోరపుఁబ్రీతి వహించి రిర్వురున్. 32

కం. బ్రహ్మయశాస్త్రి స్వపుత్రుఁడు
బ్రహ్మానందాబ్ధి మునుఁగు • భంగి వెలసెనో
బ్రహ్మసముఁడగుటచే సు
బ్రహ్మణ్యమటంచు నామ • వంతునిఁ జేసెన్. 33

ఉ. ఆదినిఁ బంచవత్సరము • కాటమొదల్ హరిచింతసేయు బ్ర
హ్లాదునిభంగిఁ బూర్వసుకృ • తాతిశయంబులుపండి రాశియై
శ్రీదయితాంఘ్రిపద్మముల • చెంతకుఁజేర్ప ననారతంబు లో
కాదరణంబుఁ బాసి సుఖి • యై రమియించెఁ దదేకభక్తితోఁ. 34

చ. ఉపనిషదంబుధుల్ దరవ • నుద్భవమై తగరామనామమన్
విపులసుధారసంబుఁ గడు • బ్రీతిగఁ బోసి తదీయమాత బా
ల్యఁపుదఱి నుగ్గు వెట్టెనో కో! • యాకొమరుండనిశంబు రామమం
త్రపఠన తత్పరుండగుచుఁ • దత్పదచింతయొనర్చె నెమ్మదిన్. 35

సీ. తోడి బాలురతోడఁ • గూడియాడఁగఁబోఁడు
మదిలోన హరితోడఁ • గదిసి యాడు
చెలికాండ్రు దనుఁబిల్వఁ • జేరక తనలోన
మధుసూదనునితోడ • మాటలాడు
నయముతో మిత్రులు • నవ్వింప నవ్వక
తనుఁదాన నులికి ప • క్కున నవ్వు
తనతల్లి భుక్తికై • తనుఁబిల్వ లేవక
తనలోన నమృత భో • జనముసేయు

గీ. పగలు రాత్రియుననెడివి • వక్షలేదు
తిథియు వారంబు వివరంబుఁ • దెలియఁబోదు
ఇల్లు పొలమను భేద • మొక్కింతలేదు
ఎచటఁ గూర్చున్న నచటనే • యింద్రపదవి. 36

సీ. దివినిండు తారకా • రవిబింబముల రామ
విగ్రహంబులు పెక్కు • పిక్కటిల్లె
భువి నికేతనశైల • భూరుహంబుల శేష
శాయిమూర్తులు వేలు • జతలుకట్టె
ఖగమృగ ఫణికీట • కములలో గోపాల
కాకృతుల్ తాండవ • మాడుచుండె
నాబాల గోపాల • మఖిల మానవులందు
లక్ష్మీ జనార్ద నో • ల్లాస మడరె

గీ. భక్తి పరవశుఁడగుచు లేఁ • బ్రాయమందు
భాగవత శేఖరుండైన • బాలకుండు
భ్రాంతి విడనాడి దృశ్య ప్ర • పంచమెల్ల
విష్ణుమయమని రూఢి భా • వించువేళ. 37

ఉ. ఏడు సముద్రముల్ గలిసి • యేకగతిన్ బ్రవహించినట్లు
లేడేడుజగంబులుం గలిసి • యేచిన భక్తిరసప్రవాహము
దేడనుజూడఁ దానయయి • యేర్పడు శ్రీహరిమూర్తులందులో
నాడెడు మత్స్యకూర్మ మక • రాదులనందగు హృన్నభంబునన్. 38

సీ. తాను మేల్కొన్న శ్రీ • దయితుండు మేల్కాంచు
స్నానంబొనర్ప స్నా • నంబొనర్చుఁ
దాజపింపఁగ జగ • న్నాథుండు జపియించుఁ
జాలించి లేవఁ గే • శవుఁడు లేచుఁ

దాభుజింపఁగ రమా • ధవుఁడుగ్రమోల భుజించు
జలముఁ గ్రోలఁగ శౌరి • జలముఁ గ్రోలు
గమనింపఁ వెన్కఁ బా • దములు ద్రొక్కుచు వచ్చు
భాషింప హరి ప్రతి • భాషలాడు

గీ. ప్రతిహతముగాని భావనా • బలముచేత
ముకురబింబితరూపంబుఁ • బోలెఁ దన్నుఁ
బ్రతిపదమునను వర్తించు • వాసుదేవు
సరసలీలలఁ గాంచి యా • శ్చర్యమొంది
పక్కనను నవ్వు లోన నా • భక్తవరుఁడు. 39

సీసమాల

సీ. ధ్యానం బొనర్పను • ధ్రువమొందు ముసుముందు
నావాహనమొనర్ప • నరుగుదెంచు
సింహాసనం బీయఁ జే • రి యధిష్ఠించుఁ
బాద్యంబునకుఁ బాద • పద్మమొసఁగు
నర్ఘ్యంబు నర్పింప • హస్తంబు జోళించు
నాచమనీయంబు • నాచమించు
నభిషేకమొసరింప • నతి సిక్ర్చలతఁ బొందుఁ
గనకాంబర మొసంగఁ • గొని ధరించు
జందెముల్ వేయ భు • జమ్ములు సవరించుఁ
జందనం బలఁద వ • క్షము నిగుడ్చు
నక్షతలకు నుత్త • మాంగమించుకవంచుఁ
బూవుదండలకు ను • ప్పొంగిచూచు
నగరు ధూపమ్ముఁ జూ • పఁగను నాఘ్రాణించుఁ
గర్పూరదీపంబుఁ • గాంచి నవ్వు

భక్ష్యభోజ్యముల నే • ర్పడఁ జర్వణమొనర్చుఁ
దాంబూలమందియం • దముగ వేయు
నివ్వాళులీయంగ • నెఱిగన్ను లర్థించు
మంత్రపుష్పమ్ము స • మ్మతి గ్రహించు
గీ. సప్రదక్షిణ పదనమ , స్కారములకు
శిరము గంపించి మెడఁ , బూలసరము వేయు
మానసార్చనవేళ న • మ్మాధవుండు
తనకు భక్తుఁ డొనర్చు తం • త్రముల కలరి.

వ. ఇవ్విధంబున నఖండంబై యనిర్వాచ్యంబై యమందానందసంధానకారణంబై యాత్మైకగోచరంబై యప్రతిహతంబై యనన్యజనదుర్లభంబై మహాపురుష లక్షణంబై కొమెసంగు నుత్తమోత్తమంబగుఁ బురుషోత్తమయోగంబుచే శరచ్చంద్ర చంద్రికా పూరంబునుం బోలె నతిప్రసన్నంబును శాంతంబునైన స్వాంతంబుతోఁ బ్రవర్తించుచు. 41

సీ. హరివాసరమనంగ , నతిసమ్మదముఁ జెందు
నుపవాసమున లోన • నుబ్బుచుండుఁ
బుణ్యనదీతీర • ములకుఁ బోవఁగనెంచు
విజనదేశంబన్న • వెదకిచేరు
సాధుసంగతియన్న • జంటబాయక యుండుఁ
బెఱవార్తలనఁ జెవిఁ • బెట్టకేగు
భూషణదూషణం , బులఁ జలింపక యుండు
దీనులయెడ దయా • స్థితి వహించు
గీ. గిరులదరి కేగి తాపస • వరుల చెంతఁ
గందమూలాశనమున నా , కలిని గడపి
తపమొనర్పంగ నెంచు చి • త్తంబునందు
బాల్యదశయందె పెఱవాంఛఁ • బాసియుండు. 42

చ. నెలకొను భక్తిభావమున • నిక్కముగా హరి సంతసింపఁ గా
వలెనని గూఢవృత్తి నెద • వందన కృత్య మొనర్చుగాని లో
కులుగని సంతసింతురని • గొప్పగఁ దన్ను నుతింతురంచు లోఁ
గల నయినం దలంపఁడధి • కంబగు నాతని శీలమెట్టిదో. 43

గీ. పుణ్యనదికేగి పెఱహేతు • వును వచించు
స్నానమొనరించి కేశ బం • ధము నమర్చు
నుపవసించియుఁ జందనం • బొడలి కలఁదు
జప మొనర్చుచు నిద్రించు • సరణిఁ దెల్పు. 44

సీ. సతతంబు హరి సమ • ర్పితమైన మదిలోనఁ
గామాదులకుఁ జోటు • గలుగఁబోదు
సర్వభూతదయాను • షక్తచిత్తములోన
నీర్ష్యాదు లుదయింప • నెడములేదు
గూఢప్రవర్తనా • రూఢమానసములో
దంభ దర్పాదుల • ధాటిలేదు
ఉపవాస ముఖ్యవ్ర • తోద్యుక్త హృదయంబు
లో మదాహంకృతు • లొప్పడములేదు

గీ. నిరతమును జండభాను స • న్నిధి వసించు
లోకవాసుల చీకటి • పోకనట్టు
లధిక విజ్ఞానమహిమతో • నమరునతని
స్వాంతమందున నరివర్గ • మంటలేదు. 45

ఉ. ఆ సుజనుండు సాపడు ప • దార్థములా హరినామకీర్తనా
యాసముచేత జీర్ణదశ • నందుచుఁ బావనమైన రక్తమున్
వాసిగ నింపఁగాఁ దనువు • నంబులు హేయపుమద్యభావమున్
బాసి యమర్త్యతంగనెనొ • వ్యాధియు నాధియుఁ బుట్టదెన్నఁడున్.

చ. కలియుగవేళఁ బెల్లుగ న • ఘంబులు వర్ధిలి ధర్మపద్ధతుల్
పొలియఁగ విష్ణుభక్తి భవ • మోచనసాధనమంచు నెల్ల లో
కులకు వచింపఁ దొల్లటి శు • కుండె యిటుల్ జనియించెఁ గాని
దళముగు నిట్టిభాగవత • ధర్మము వేఱొకచోటఁ గల్గునే.

సీ. పల్కులన్నియుఁ బ్రౌఢిఁ • బల్కనేరక మున్న
హరినామ పఠన • మభ్యాసమయ్యె
దల్లిదండ్రులయందుఁ • దగుల మంటకమున్న
దైత్యారియందుఁ జి • త్తంబుదగిలె
భవసాగరమునందుఁ • బడిమునుంగక మున్న
శౌరిపాదాబ్జముల్ • చేరఁబట్టె
విశ్వంబు దన్నుఁ గం • పింపఁ జేయకమున్న
విష్ణు భావమున వ్యా • పించిచూచె
గీ. వ్యాధిజనియించి యతిశయిం • పకయ మున్న
యౌషధము గొన్న నేర్పరి • యనువుదోఁపఁ
బ్రకృతిరోగంబు వృద్ధిబొం • దకయ మున్న
విష్ణునామామృతంబు సే • వించుచుండె. 48

మ. తలిదండ్రుల్ దను నందనుండనుచు భ్రా • తల్ సోదరుండంచు మి
త్రులు దన్ మిత్రుఁడటంచు బాంధవులు బం • ధుండంచు నానావిధం
బులఁ బ్రేమించిన వారిపై మది లవం • బున్ బ్రాకఁగానీక ని
చ్చలు సర్వాత్మకమైనభక్తి హరిపై • సంధించి క్రీడించెడున్. 49

ఉ. నాసదనంబు నాధనము • నాతలిదండ్రులు నాసహోదరుల్
నాసుతులంచు భిన్నమతి • నాన యొకింతయు లేక మాయచే
మోసముఁ జెంది సర్వజగ • ముక్తి హరిదేవు నధీనమంచు లో
వీసమెఱుంగనట్టి యప • విత్రునిఁ గాంచి తపించు నెప్పుడున్. 50

సీ. నిలువఁ డెచ్చటనైన • నిలిచెనా సకలపా
తకహరంబైన తీ • ర్థమున నిల్పఁ
గొలువఁ డెవ్వరినైనఁ • గొలిచెనా పంకజో
దరు భక్తియుక్తిఁ జి • త్తమునఁ గొల్వఁ
గోరఁడే వరమైనఁ • గోరెనా నిష్కామ
వృత్తి నిశ్చలభంగి • వెలయఁగోరుఁ
జేరఁ డెవ్వరినైనఁ • జేరెనా పరమశాం
తులు ముక్తులైన సా • ధువులఁ జేరుఁ

గీ. నడుగఁ డేమాట నడిగెనా • యఖిల సృష్టి
గాని దొలుదొల్త నిర్గుణుం • డైన హరినిఁ
గనుట నిర్వాణమందురా • గనుటయెట్టు
లా హరియు నెవ్వరనుచు • దైన్యమున నడుగు. 51

చం. మొదలిటి సస్యగర్భమునఁ • బుట్టిన బీజము మెల్లమెల్లగా
నదనునఁ బైకివచ్చి రస • మై తగు క్షీరముదాల్చి చిక్కనై
ముదిరినభంగి నాతని ప్ర • బోధపు బీజము లోజనించి య
భ్యుదయముఁబొంది భక్తిరస • ముం గని సంతతపూర్ణదీక్షచేఁ
బదపడి నిర్గుణత్వ పరి • పాకముఁ జెందఁగ సిద్ధమయ్యెడున్. 52

సీ. అమరినయెడ స్నాన • మాచరించుటగాని
జాహ్నవికేగు నా • సక్తిపడలె
నుత్సాహమగునాఁడె • యుపవసించుటెగాని
హరిదినంబనెడి ని • త్యత్వమెడలె
నుచితభంగిని హరి • కుపచారమిడుఁగాని
దివ్యార్చనమునందు • దీక్షవదలెఁ

కొన్నివేళల విష్ణుఁ • గొనియాడుచు నేగాని
యవిరతనామ సం • స్తవము లెడసె

గీ. క్షణము తెలివొందు వేఱొక • క్షణము మఱచు
గ్రహము సోకినవాసినై • ఖరిగనుండు
మఱియు నున్మత్తుపోలిక • మైఁజరించు
నచల వారాశి సన్నిధి • నైనవేళ. 53

చ. అరుణుఁ డనంతయోజనము • లందు వసింపఁగ ముందుముందు గ్రి
క్కిరియు తమోభరంబు హరి • యించెడిభంగి ననంతపూర్ణ భా
స్కరుఁ డుదయింపఁ బోవుతటి • గాఢతమంబు క్రమక్రమంబుగా
విరియఁగఁ గర్మవాసనలు • వీడ్కొనఁ జొచ్చె నిసర్గపద్ధతిన్. 54

గీ. సహజమాటను విడువ ని • చ్ఛయును లేక
వాసన లయించుటను జేయ • వలను లేదు
చేయు నొకవేళ నొకవేళఁ • జేయకుండు
నెల్ల కృత్యములతఁడు యా • దృచ్ఛికముగ. 55

చ. వెనుకటి కర్మపద్ధతులు • వీడ్కొనసాగెను ముందుఁ జేయఁగా
మనమున నేమి దోచ దొక • మాఱును సుస్థిరభంగిలేదు మం
తనమున మందుద్రిమింగి పరి • తాపము నొందెడు వానిపోల్కిఁ దీ
రని వ్యథఁజెందు నీవిధము • రా గతమేమని చూచు నభ్రముగ్. 56

గీ. ఈచరిత్రంబు నెవ్వరి • కెఱుక పఱతు
నెవరు నా మానసవ్యథ • నెఱిఁగి దీర్తు
రెట్టి హేతువులేక యా • దృచ్ఛికముగ
నడరె నీపింత సంతాప • మనుచు వగచు. 57

వ. ఇట్లు నిరంతర సంతప్యమానాంతఃకరణుండనై కరణీయంబు గానక తల్లడిల్లుచు సంచరించు సమయంబున. 58

సీ. దేహంబులెల్ల నీ । స్థితిఁ జెందునని తెల్ప
మైనిండ ధవళభ । స్మంబు వెలయ
సకలంబుగాంచు లో । చన మిదేయని చెప్ప
భ్రూమధ్యమున నూర్ధ్వ । పుండ్రమలరఁ
బంచభూతము లింత । పాటివేయని తెల్పఁ
గనుదోయి ముకుళనం । గతి వహింపఁ
బ్రాతుల కమృతంపు । వరదయంచు వచింప
దాపునఁ దీర్థపా । త్రంబు మెఱయ

గీ. రసనకును రామనామమం । త్రము ఘటించి
హస్తమున నక్షమాలిక । యనువుపఱచి
యున్న పాపయశాస్త్రి స । ర్వోత్తముండు
సద్గురుం డొక్కచోట సా । క్షాత్కరించె. 59

క. ఈ మహనీయునిఁ జేరిన
నామానస తాపమెల్ల । నయమగునని యా
ధీమంతుఁడు పదములకుఁ బ్ర
ణామంబొనరించి భక్తి । నమ్రుం డగుచున్. 60

గీ. తన మనోగతతాపమం । తయు వచించి
దీని మరలింపఁగలుగు మ । హానుభావు
లెవరు మీకన్న! నను భరి । యింపుఁడనఁగ
నమృతదానం బొనర్చె మ । హాత్ముఁడపుడు. 61

సీ. ఉపనిషన్నదులన్ని । యునుగూడి యాత్మైక
గతికంబులై తన్నుఁ । గలియుచుండఁ
జలనంబొనర్చు సం । శయతరంగము లెల్ల
శాంతించి పూర్ణని । శ్చలత వెలయ

భేదభావద్వీప • వితతులు తనలోన
మగ్నంబులై రూపు • మాసిపోవ
నానాటఁ దనయందు • మానసచంద్రుఁ డు
ద్భిన్నుఁడై జగము దీ • పింపఁజేయఁ

గీ. దనదు గాంభీర్యవైశాల్య • ఘనమహత్వ
మింతయంతని వర్ణింపఁ • జింత సేయ
నజ గిరీశాదులకు నయిన • నలవిగాని
యద్వయానందవార్ధియై • యలరె నతఁడు. 62

ఉ. తోరపుఁ బూర్వపుణ్యతతి • దోహదమై హరిభక్తి శీతలా
సారమునై యెసంగునల • సజ్జనమానస భూమియందు స
త్సారగురూక్తినామక ర • సాలపుబీజము నాటెసంత బెం
పారి మహీరుహంబయి మ • హాఫలమున్ ఫలియించెవింతగన్. 63

మ. ధర నాసేతుహిమాచలంబులకు మ • ధ్యప్రాంతమందంతటం
జరణస్పర్శముఁజేసి సాధుజనులన్ • సద్భక్తి సేవించి త
త్పురుషశ్రేష్ఠుల చిత్తమర్మములు సా • ధుప్రక్రియన్ సత్వపు
ష్పరసంబుల్ గొను భృంగసంగతిని సం • పాదించె దీక్షామతిన్. 64

సీ యతులు సాధులు గల్గి • రని విన్న గిరిదుర్గ
గహనంబులైనఁ • గొంకకయె పోవుఁ
బోయి వారి ప్రసన్న • ముఖదర్శనంబుకై
నెలలకొలంది గ • న్పెట్టియుండు
నుండి దర్శనమైన • నుల్లోలహృదయుఁడై
ఫలపుష్పదళ సమ • ర్పణముఁ జేయుఁ
జేసి రోమాంచసం • చితహర్ష బాష్పగ
ద్గదుఁడౌచుఁ బాదవం • దన మొనర్చు

గీ. వందన మొసర్చి విష్ణుభా • వంబుతోడ
దివ్యమంగళరూపంబుఁ • దేటకాంచుఁ
గాంచి తదనుజ్ఞ చేతఁ జెం • గట వసించి
వారి బోధామృతము పీను • లారఁ గ్రోలు. 65

సీ. కందమూలంబు లొ • క్కదినాన లభియించు
నొకనాటి కవి లభిం • పకయు నుండు
వనఫలావళియొక్క • దినమునఁ జేకూడు
నొకవేళ నది చేకు • ఱకయునుండు
నోషధీరసపాన • మొకనాడు కొల్లయౌ
నదియు నొకప్డు శూ • న్యముగ నుండుఁ
దగఁదీరు పానీయ • మగపడు నొకవేళ
నొకవేళ మరుమరీ • చికలు దొరకు

గీ. నుదరపూర్తికి నున్న లే • కున్నఁ గాని
యనుభవానందవార్ధిలో • మునిఁగి మునుల
దివ్యబోధామృతమునఁ దృ • ప్తిని వహించు
రాజదనుభోగి యాబాల • రాజయోగి. 66

చ. ఇతరములెల్ల వీడ్కొలిపి • యెండ్లకొలంది తదేకదృష్టితో
సతతమునుండు యోగులకు • సయితము నీవలెఁ దన్మయత్వసం
గతి వహియింపరాదు కడ • కం గడుఁ జిన్నతనంబు నందె పొం
దితివి శివస్థలంబని ను • తింతురు సన్మునులెల్ల నాతనిన్. 67

వ. ఇట్లు సాధుసందర్శనాభిలాషంబు డెందంబునఁ దంతకంతకుఁ గొనలు సాగుచుండ సంపూర్ణపూర్ణిమా చంద్రచంద్రికాసారంబుచే విసుగుఁ జెందని చకోరంబు చందంబున సవాజ్మానసగోచరంబైన రాజయోగానుభవసామ్రాజ్యమునం దనివితీరక సంచరించు నా బాలతపోధనునకుం బరమపావనంబైన యొక్క తపోవనంబున. 68

సీ. ఏ మహాత్మునకు నూ • హింప భ్రూమధ్యవా
రణాశీక్షేత్రంబు • రాజధాని
ఏ భాగ్యశాలికి • సిరవొందు నణిమాది
లష్టసిద్ధులు చేతి • యాటచెండ్లు
ఏ యోగివరున క • మేయముల్ లయమంత్ర
హఠరాజయోగంబు • లాటపట్లు
ఏ పరాత్పరునకు • రూపింప నూర్ధ్వకుం
డలి ఫణాపటలి ర • త్నంబుగొడుగు

గీ. ఎవని ఫాలాగ్ని త్రిపురముల్ • రవులుకొల్పి
కనలి కామాదివైరి వ • ర్గంబు గాల్చె
నట్టి మదగజహరుఁడు పం • చాస్యుఁ డపర
దక్షిణామూర్తి విశ్వనా • థ గురుమూర్తి. 69

క. సాక్షాత్కరింప నమ్ముని
సాక్షాచ్ఛివుఁడనుచు సకల • సంయములును బ్ర
త్యక్షముగఁ దెల్పవిని య
య్యక్షరుని పాదాబ్జములకు • నవనతుఁ డగుచున్. 70

చ. సవినయవైఖరిన్ నిలువ • సంయమి చంద్రుఁడు దివ్యదృష్టివై
భవమునఁ వానిఁ గాంచి యతి • పావనుఁడంచు మదిం దలంచి యు
త్సవమున వాని గాత్రమును • దక్షిణహస్తముచే స్పృశించి యైం
దవ కిరణాతిశీతకరు • ణారస మాతనిమీఁద జల్లుచున్. 71

గీ. వత్స! నినుఁజూడ వాత్సల్య • ముత్సహించె
మనసుఁ దొలిజన్మమందు సం • బంధమొకటి
గలదు తచ్ఛేషమును దీర్పఁ • గలను నీకు
సాధుసాంగత్యమూగక • చనునె! యెందు. 72

చ. అనివచియింప మున్ను గురు • నాజ్ఞవహించుటఁ జేసి యా తపో
ధను పదాంబుజంబుల ము • దంబునఁబట్టి తదీయ బోధవా
గ్వనధిమహాతరంగములు • పైకొన ప్రీలక నిల్చి ధీరుఁడై
చనవునఁ గుంభసంభవుని • చందమునం గబళించెనంతయున్. 73

వ. తదనంతరంబ కొంతకాలంబునకు. 74

సీ. వసుధపైఁగాని సి • ల్వఁగ నేరనట్టి దే
హము నిరాలంబదే • శమున నిలిచెఁ
గందములాదులఁ • గాని తీరని క్షుధా
జ్వాల మారుతముచే • శాంతిఁ జెందె
మరలింపఁగాని యూం • తరవీథిఁ జేరని
చిత్తంబు తనుదానఁ • జేరఁ జొచ్చె
గాఢసుషుప్తిలోఁ • గాని మాయని జగం
బంత జాగ్రదవస్థ • యందె మాసె

గీ. కర్మషట్కంబు మిత్రసం • గతి వహించెఁ
గల్పసిద్ధులు భృత్యులై • కానవయ్యె
మోక్షలక్ష్మి సమస్తస • ద్భూషణముల
మించి యతిశాంతుఁడనుచు మో • హించె నతని. 75

వ. ఇవ్విధంబున నాంతరక్రమంబుచే ముక్తికాంతావివాహితుం డయ్యును బాహ్యక్రమంబుచే నస్ఖలిత బ్రహ్మచర్యుం డగుటంజేసి జననీజనకాది వృద్ధవర్గంబా భాగవతశిఖామణికిం బరిణయంబుఁ జేయ సమకట్టి తద్వృత్తాంతంబా శాంతహృదయున కెఱుకపఱచిన గహనమార్గంబున నొంటరియై యేగు పథికుండు సింహగర్జనంబుచే భీతిల్లి గడగడ వణంకు చందంబున నుల్లంబు ఝల్లుమని పెల్లుగ దురపిల్లుచు నాత్మజనకు నొక్క వివిక్తదేశంబున సమాసీనుం గావించి సాష్టాంగదండ నమస్కారంబు గావించి భయవినయంబులు దళుకొత్త నంజలి

సంధించి ప్రశస్తంబయిన వాస్తవ వచన వైఖరిత్రో నమ్మహాత్ము
కిట్లనియె.

మ. జనకా! వృద్ధులు మీరు మీకు సదసద్ • జ్ఞానం బసూనంబు మీ
మనమందెన్నఁ డసారభావము జనిం • పంబోదు విద్వేషికై
నను సేమమ్మొసరింపనెంచెదరు గా • నన్ మీ తనూజుండ నా
మనవిం జేకొని నన్నుఁ బ్రోవుము మహా • త్మా! సౌఖ్యసంధాయకా!

సీ. మీ మూలమునఁ గాదె! • రామతారకనామ
మంత్రయంత్రశ్రీమా • మహిమఁ గంటి
మీ సత్కృపనుగాదె! • మేదినీస్థలిఁ గల్గు
పరమసాధులఁగాంచు • ఫలముఁగంటి
మీ హేతువునఁగాదె! • దేహాభిమానంబు
విడిచి శ్రీహరిని సే • వింపఁగంటి
మీ ప్రసన్నతఁగాదె! • యప్రమేయంబైన
యుపనిషత్సారంబు • నొందఁగంటి

గీ. నింతదనుకను ననుకూల • వృత్తితోడఁ
బరమసౌజన్యమొలయఁ గా • పాడుచుండి
మధురమధురసధారల • మఱగినట్టి
రసనకును దిత్తరసపూర • మొసఁగఁదగునె!

సీ. కామాదిలతలు జి • క్కఁగనల్లు పందిలి
ముక్తిమార్గము నడ్డు • ముండ్లకోరు
అష్టపాశముల బి • ట్టరికట్టు కంబంబు
మోహభూజముఁ బూచు • దోహదంబు
హృదయమీనమునకు • నెరతోడి గాలంబు
తను నెఱుంగని నేర • మునకు బంది

ఈషణాత్రయసస్య • పోషణక్షేత్రంబు
లేనిదున్నట్లు క • ల్పించుమాయ

గీ. ముసరుభీభత్సములకుఁ బు • ల్కసగృహంబు
ప్రతిపదభయంబునకు యమ • ద్వారసీమ
తామసవిహారమునకుఁ బా • తాళనగరి
సుఖమె! సంసారమనువ్యాఘ్ర • ముఖముఁ జొరఁగ. 79

సీ. తనువను బ్రహ్మాండ • మునఁ గల్గు ఘనమోహ
వంధిలో విజ్ఞాన • భాస్కరుండు
మగ్నుఁడౌ వేళఁ ద • మంబునిండినఁ జూచి
కామాదికుటిల త • స్కరులు లేచి
యాశామహాసి నొ • య్యనఁదీసి విషయపం
చక శాణములయందు • సానబట్టి
కరమున ధరియించి • కమనీయవైరాగ్య
లత నూడఁబెఱికి మూ • లంబునఱికె

గీ. శమదమాదిసుమంబుల • సౌరు జెఱిచి
తన్ని కుంజాంతరమున ని • స్తంద్రమహిమ
నలరు నపవర్గధనరాశి • నపహరింతు
రకట! ఘాతుకులను జేర్ప • నగునె! యెంకు. 80

చ. తనువు జనించినంతనె ప • దంబులుబట్టిన మృత్యుపన్నగం
బనువున మెల్లమెల్లఁ దను • వంతయుమ్రింగి తనుఁ హరించు ని
ట్లని యెఱుఁగంగఁబోక జడుఁ • డై హరిపాదసరోజవందనా
ర్చనములు మాని సంసరణ • సాగరమందు మునుంగఁజెల్లునే! 81

చ. హరియను నర్తకుండు తన • యద్భుతశక్తిఁ బ్రపంచరంగమం
దరుదుగవిస్తరిల్ల నటుఁ • డై నటియించుచుఁ దానెసభ్యులై

యురవుగఁ జూచుచుండుఁ బరుఁ • డెవ్వఁడు లేఁ డిది చిత్రనాటకం
బెఱుఁగని వాఁడు భిన్నమతి • నెంతయు వంత లసంతసిపించెడున్. 83

ఉ. మేనును నాలుబిల్లలును • మేడలు మిద్దెలు భూము లర్థసం
తానము గోతురంగను మ • తంగజ యూథములాదిగల్గు నా
నానుభవంబు నేత్రగత • మైన వికారముగాని సత్యసం
ధానముగాదు గాన నయ • నంబులు మూయఁగ మాయునంతయున్.

గీ. నిమిష నిమిషంబులోన నం • తమును జెందు
నీప్రపంచంబు శాశ్వత • మే! తలంప
నిట్టి యస్థిరభోగంబు • లెల్ల నమ్మి
యాత్మవిజ్ఞానమహిమంబు • నణఁపఁదగునె! 85

వ. అని యాత్మజుండు వలికిన నం దదీయ వినయవివేకచాతుర్యంబులకు డెందంబునం దమందానందంబు నొందియు, లోకవ్యతిరేకంబున కంగీకరింపనేరక, మోదఖేదసమ్మిశ్రితంబైన చిత్తంబులో నించుక చింతించి న్యాయమార్గంబుచేఁ బ్రత్యుత్తరంబు జెప్పవలనుగాక యుక్తిమార్గంబు నవలంబనంబు జేసి యమ్మహాభాగుండా భాగవతశేఖరుని కిట్లనియె.

మ. తనయా! నీవు వచించు ధర్మమతి యు • క్తంబున్ మహాత్మసమ్మతం
బననౌ; నైనవసిష్ఠగౌతమపుల • స్త్యాగస్త్యభృగ్వాదు లా
మునివర్యుల్ తరుణీసమేతులగుచున్ • మున్నాత్మవిజ్ఞానులై
మనరే! తత్త్వవిచారధీరులఁ జలిం • పంజేయు చోటున్నదే! 86

గీ. ఇంద్రియంబుల విషయముల్ • చెందనీక
నియమములరంగఁ జిత్తంబు • నిగ్రహించి
సముచితాచారతత్పర • త్వమున నుండు
సతనిగార్హస్థ్యమనఁగ య • త్యాశ్రమంబె. 87

వ. ఇదియునుంగాక తొల్లి భగవంతుడైన యాజ్ఞవల్క్యుండు జనకచక్రవర్తికిం బరిపూర్ణబోధఁ జేసిన, నతం డఖండవైరాగ్యవంతుడై

దారాపత్యరాజ్యవిత్తాది సంసారంబు బంధకారణంబని తలంచి యన్మహాత్మునితోడ నరణ్యనివాసంబుఁ జేయనమకట్టిన నమ్మునీం ద్రుంబు తత్ప్రయత్నంబునుండి మరలించి, యతని సందేహంబు నివారించి యథాపూర్వకంబుగా రాజ్యాదికంబు నిర్వర్తింప నాజ్ఞాపించెఁ గాన నిట్టియుత్తమగార్హస్థ్యంబు నిందింప బనిలేదు. అది యట్లుండ నిమ్మ ఇంకొక విశేషంబుగలదు. చెప్పెద నాకర్ణింపుము. 88

సీ. జనకాజ్ఞయనికాదె! • మును రామభద్రుండు
సతితోడ గహనవా • సంబుజేసె
ప్రభునాజ్ఞయనికాదె! • పవమాననందనుం
డంభోధులెల్ల నొ • క్కంజ దాటె
గురునాజ్ఞయనికాదె! • పరలోకమునకేగి
మృతుఁడైన సుతుఁదెచ్చి • యిచ్చె శౌరి
అగ్రసోదరునాజ్ఞ • యనికాదె! భీమాదు
లాపన్నులయ్యును బొంది • రట్టి యిడుము

గీ. తొంటివారలు మహదాజ్ఞ • గెంటలేక
వెతలకైన సహించి కా • వించిరట్లు
గాన హితమైన విహితమా • ర్గము విధించు
నట్టి జనకాజ్ఞ మితిమీఱ • నగునె! నీకు. 89

వ. అని యాసతిచ్చినం జనకవాక్పాశానుబద్ధుండై యతిక్రమింపశక్తుండు గాక యుద్వాహంబున కంగీకరించి ముక్తికాంతం బట్టమహిషిగా నుంచి ప్రకృతికాంతను ద్వితీయఁగాఁ బరిగ్రహించి సపత్నీద్వేషంబు జనింపకుండ నిర్వురిమెడల సమదృష్టివహించి పరిపాలించుచు సాంసారిక తాపత్రయాపన్నులైన భక్తులకుం బ్రసన్నుండై యధ్యాత్మ విద్యాసంపన్నులంజేయుచు నమ్మహాయోగి దేదీప్యమానుండై యుండ తత్కీర్తిచంద్రికాపూరంబు భూనభోంతరంబు నిండియున్నను

విజ్ఞానచక్షుర్విహీనుండ నగుటంజేసి తెలియంజాలక పరితపించుచుం
గొంతకాలంబున కాప్తవాక్యంబుచేఁ గన్నులెఱచి యమ్మహాపురు
షుని సందర్శించి యనేకజన్మార్జితంబైన సత్కర్మపుంజమ్ముచేఁ బరి
పాకంబుఁ జెందిన మన్మనఃఫలంబు తదీయపాదారవిందంబుల కుపహా
రంబుగా సమర్పించి సాష్టాంగనమస్కారం బాచరించి మహాభక్తి
తోడ నంజలి బంధించి. 90

మ. వరబోధాపరవాసుదేవ! ధరణీ • ప్రఖ్యాతసద్భావ! బం
ధురతత్త్వార్థవిచార! సంసరణపా • థోరాశిసంతార! స
ద్గురుసేవాసముపాత్తధైర్య! నిలస • ద్గోపాలపాదాబ్జభా
స్వరభక్తిప్రియ! భక్తలోకహిత! సు • బ్రహ్మణ్యనామాంకితా. 91

మానినీవృత్తము. నిగమవనవిహారా! • సత్యవైరాగ్యధీరా!
విగతభవవిచారా! • విష్ణుభక్తిప్రచారా!
జగదుపకృతిగేయా! • సర్వతోనష్టమాయా!
సుగుణగణనికాయా! • సూరిగణ్యాభిధేయా. 92

శా. స్వామీ! సర్వజగచ్ఛరణ్య! యనృత • ద్వంద్వక్రియాతీత! ని
స్సీమప్రాభవ! మీపదాబ్జములు సం • సేవింప సాంసారిక
వ్యామోహంబులుమాసి విష్ణుపద ని • ర్వాణంబుచేకూరు నా
హా! మీవైభవమింతయింతయని వ • ర్ణ్యంబౌనె! యెవ్వారికిన్. 93

ఉ. మీపదపంకజాతములు • మెట్టిననేలలు పుణ్యభూములౌ
మీపదరేణుతీర్థము ల • మేయవియత్తటినీజలంబులౌ
మీపలుకుల్ మహామహిమ • మించిన వేదగణంబులౌ మహా
త్మా! పరమేశ! మిమ్ముఁ గొని • యాడఁగ వాసుకికైన శక్యమే!

గీ. తనదుకల్మికి నలరుబాం • ధవుఁడు దొరకు
నిషుములను దోఁచుపడునాత్మ • హితుఁడు దొరకుఁ
వలయు ధనధాన్యమొసఁగు భూ • వరుఁడు దొరకు

దొరకునే! మిమ్ముఁబోలు స • న్మునివరుండు. 95

సీ. ఆతపశ్రాంతునకు శీత • లాంబులహరి
ధనవిహీనున కమితకాం • చననిధాన
మబ్బినట్టులగాదె! భ • వార్తుఁడైన
మనుజునకు మీముఖాబ్జద • ర్శనము దేవ! 96

గీ. తాపమును బాపు బూర్ణసు • ధాకరుండు
పాపమును బాపు దివ్యాప • గాపదంబు
తాపమును బాపమును రూపు • మాపనోపు
స్వామి! మిముబోటి సద్గురు • వరులసేవ. 97

వ. అని విన్నవించిన నిత్యప్రసన్నంబైన కరుణావలోకనంబుచే మద్గాత్రంబునెల్ల మందాకినీరసపూరంబునంబోలెఁ బావనంబు గావించుచు ననన్యసాధారణంబైన వాగ్ధోరణీతరంగిణిచే మదీయహృదయాకాశంబు నిండించుచు నమ్మహాపురుషుం డిట్లనియె. 98

చ. ఉరుతరమా నభస్థలము • నొక్క మొగింగబళింపవచ్చు సా
గరములు నేమనుం గరయు • గంబుననీఁది తరింపవచ్చు నీ
ధరణికి లిప్తమాత్రన ప్ర • దక్షిణమై మఱలంగవచ్చు నా
హరిమహిమంబులోన లవ • మైన నెఱుంగనసాధ్యమేరికిన్. 99

చ. అశనము లేక తోయముల • నైన నుగ్రోలక వాయుభుక్తిచే
గృశతరదేహులై దశవి • ధేంద్రియముల్ నియమంబుచే నహ
ర్నిశము బిగించి విశ్వము హ • రించి చలింపక నిల్చినట్టి తా
దృశమునివర్యులింత వివ • రింపుదు రేమొ! హరి ప్రభావమున్. 100

గీ. తరణి యాధారమునఁ గాక • యురుతరాబ్ధి
నోలలాడంగ దక్షత • జాలనట్లు
గురుని యాధారమునఁ గాక • హరిమహాత్వ
మరయ దక్షులె? యజగిరీ • శాదులైన. 101

క. గురుఁడే విష్ణుఁడు జిష్ణుఁడు
గురుఁడే రుద్రుండు నజుఁడు • గురుతరమహిమం
గురుఁడే పరదైవతమగు
గురుపరదైవతములేదు • గుణశాలురకున్. 102

సీ. శక్తిమిత్రా సదాశివా • రంభమగుచు
శంకరాచార్య మధ్యమై • శస్తమగుచు
నస్మదాచార్యపర్యంత • మైనయట్టి
గురుపరంపర కెపుడు మ్రొ • క్కుదును మదిని. 103

క. హరిమహిమఁ దనకుఁ దెల్పెడి
గురునిన్ నరుఁడనుచుఁ దలఁచి • కుంఠితభక్తిం
దిరుగు పురుషుశ్రమమెల్లను
గరిశౌచమ్ముక్రియ నిరర్థ • కంబగు నధిపా! 104

వ. అను తొంటి భాగవతసూక్తి ప్రకారంబున గురుస్వామిని పరదైవతంబుగా భావించి యాచరింపదగిన గురుగీతాగతంబులైన కొన్ని సనాతనధర్మంబు లెఱింగింతు నాకర్ణింపుము. 105

చ. తెలతెలవారలేచి గురు • దేవనివాస దిశాభిముఖ్యుఁడై
నిలిచి కరంబులందు రమ • ణీయసుమంబుల దోయలించి ని
శ్చలమతిఁ దత్పదాంబురుహ • సన్నిధిఁ గల్పనజేసి భక్తి పెం
పలరఁగఁ బూజజేసి సక • లాంగములన్ బ్రణమిల్లగాఁదగున్. 106

క. అత్యంతనియతిఁ బ్రాతః
కృత్యంబులుదీర్చి దేశి • కేంద్రోక్తవిధిన్
నిత్యజపదీక్ష నడుపుచు
సత్యవ్రతుఁడగుచు నిల్వఁ • జను నెల్లపుడున్. 107

సీ. ఆచార్యుతోడ నే • కాసనమందు నుం
డఁగరాదు మునుముందు • నడువరాదు

గురుగుణంబులు లెక్క • గొనరాదు మాటకు
నెదురు జెప్పఁగరాదు • ముదముతోడ
గర్వోక్తులనరాదు • గుర్వాజ్ఞ లేని య
త్నమొనర్పఁగారాదు • నవ్వరాదు
పరిహసింపఁగరాదు • పదము గన్పడఁ జెంత
గూర్చుండరాదు పె • క్కులనరాదు

గీ. నీడఁ ద్రొక్కఁగరాదు • నిందింపరాదు
నిందవినరాదు ద్వేషంబు • నెఱపరాదు
మంత్రతీర్థప్రసాదని • ర్మాల్యములను
విడువరాదు శంకల • నడుగరాదు. 108

క. త్వంకారంబునఁ బిల్చుట
హుంకృతి మంత్రాదికముల • నండఱతో ని
శ్శంకం దెల్పుటయును నివి
పంకిలమానసుల తుచ్ఛ • భావములరయన్. 109

గీ. తనదు ధనధాన్యవస్తువా • హనచయంబు
ముందు గురునకు నుపహార • ముగ నొసంగి
తాను భుజియించు సర్వప • దార్థములను
గురుధనంబని మదినెంచి • కుడువవలయు. 110

గీ. గురుముఖంబున నిగమముల్ • కొనలుసాగు
గురుపదంబునఁ దీర్థముల్ • గూడియుండు
గురుతనువు నెల్ల దేవతల్ • గొల్చుచుండ్రు
గురుని నరమాత్రునిగ నెంచఁ • గూడు నొక్కొ. 111

క. పరిపూర్ణ కరుణఁ దనపైఁ
బఱపుచుఁ జనవిచ్చుకొలఁది • భయభక్తులతోఁ

విరుగవలయుఁ దప్పినచో
గురువుల యాకృతులు శాంత • ఘోరములు సుమా. 112

వ. ఇవ్విధంబున సమాసక్తంబయిన భక్తియోగంబుచేఁ బవిత్రవస్త్రా నుండవై గురుకరుణయనెడు నోఱయం దిమిడియున్న బోధకరవాలంబుఁ బ్రశస్తంబయిన చిత్తహస్తంబున ధరించి దారాపత్యాదిమోహలతావృతంబైన ప్రపంచకారణ్యంబు భేదించి దుస్సాంగత్యంబను వర్షాతిరేకంబుచే ఘనీభవించిన రాగద్వేషంబులను శిలాద్వయంబు వైరాగ్యతరణిచే నుత్తరించి తాపత్రయంబను నిదాఘోష్మంబునం గలిగిన సంసరణమార్గాయాసంబు శాంతింప సజ్జనవృక్షంబుల నీడఁ గటాక్షప్రసారంబులను మందమారుతంబులోలయ విశ్రాంతిఁ జెందుచు నసహాయశూరుండైన విజ్ఞానమిత్రుండు మార్గదర్శియై ధైర్యంబు మెఱయ మునుముందు నడుచుచుండఁ గ్రమక్రమంబునం జిరకాలంబునకనేకప్రమాణంబుల ననంతదూరంబు నతిక్రమింప. 113

గీ. సకలచిత్రంబులకు జన్మ • సదనమగుచు
గగనతలమంటి శిఖరమొ • క్కటి వెలుంగఁ
గుడియెడమలందుఁ బక్షముల్ • గొమరుమిగులఁ
బాదములు రెండు రెండు పా • ర్శ్వములఁ దనర
దాపగు శతాయుష మను భూ • ధరము నీకు. 114

గీ. ఆమహీధర చిత్రంబు • లేమిచెప్ప
నారు ఋతువుల నొక్కటే • తీరుగాగ
మెండుకొనియుండు డెబ్బది • రెండువేల
కొండకాల్వలు శిఖరంబు • నుండి పాద
ములకు దిగుచుండు ప్రళయంబు • మొనయుదాఁక. 115

కం. అలనిర్ఝరముల సారము
నెలమిం గైకొనుచు నెప్డు • డెల్లబ్రాయమ్మున్

నలరు తమాలమహీరుహా
ములు ముప్పదిమూఁడు కోట్లు • బొల్పగుచుండున్. 116

కం. ఆ గిరివరమునఁ బశ్చి
ద్భాగమున ననంతపర్వ • పరిశోభితమై
యాగిరి కాద్యంతంబును
బాగుగ నొకవేణుయష్టి • ప్రాపై యుండున్. 117

గీ. అట్టి కీచకదండంబు • నాశ్రయించి
యూర్ధ్వముఖమై మహాసర్ప • మొకటిగలదు
తత్ఫణారత్ననిచయము • ద్దండదీప్తి
శిఖరితలమెల్ల దీపింపఁ • జేయుచుండు. 118

వ. మఱియుం బురోభాగంబున ననంతయోజనవిశాలంబులైన సప్త
ప్రస్థంబులు గలవు. అందు బ్రథమప్రస్థంబున గజాననుండును, ద్వితీ
యంబునఁ జతురాననుండును, తృతీయంబున భర్మాంబరుండును,
జతుర్థంబునఁ జర్మాంబరుండును, బంచమంబునఁ గించిజ్ఞుండును,
షష్ఠంబున సర్వజ్ఞుండును, సప్తమంబున జగద్గురుండు ననుచక్రవర్తులు
భృత్యామాత్యాది సమస్తపరివారంబులుంగొల్వఁ గొల్వుదీర్చి యుం
దురు. అందు షష్ఠ సప్తమ ప్రస్థంబుల నాక్రమించి సప్తగవాక్షవిరా
జితంబై రత్నాపణంబను నొక్క ప్రాసాదంబు విలసిల్లుచుండు. 119

కం. అలసౌధమునకు డాపల
వలపలనుంగల యుభయయుగ • వాక్షములందున్
నెలకొని వృద్ధశ్రవుఁడను
లలితుఁడఖిలగీతరవము • లన్ వినుచుండన్. 120

సీ. ప్రాగ్భాగమున నధః • పార్శ్వమ్మునందొక్క
జాలకం బమరు నా • స్థానమందుఁ

బొదలు రసజ్ఞుఁడన్ • పురుషుండు షడ్రసా
శ్రితపదార్థముల భు • జించుచుండు
నాసికాదిఁ గల్గు గ • వాక్షయుగ్మమునందు
గంధజ్ఞుఁడనెడి భూ • కాంతుఁడుండు
సతతము ప్రఫుల్లపు • ష్పాదికంబులఁ గల్గు
నెల్లవాసనల గ్ర • హించుచుండు

గీ. నాపయి నెసంగురెండు గ • వాక్షములను
నధివసించి సుదర్శనుం • డనెడి రాజు
నీలపీతాది వర్ణసం • దీప్తమయిన
చిత్రపటముల నెల్ల నీ • క్షించుచుండు. 121

ఉ. ఆపురుషాళిభోగముల • నబ్బురమొప్పఁగఁ గాంచినీవు కే
లీపరతంత్రతన్ గనక • లేశముఁ గొంకక యోజనంబులన్
లోపలఁ ద్రోచి యాతలుపు • లుం బిగియింపుమనంతరంబ ర
త్నాపణమైన మేడ ప్రతి • హారకవాటము లుద్ఘటిల్లెడున్. 122

వ. అంత నీప్రాచీనమిత్రునితోడ నాహారిద్వారమార్గంబున సౌధాంతరాళంబు ప్రవేశింప, మునుముందు ఘనఘనావృతంబైన వర్షాకాలరాత్రియుంబోలెఁ జిణిచిణి నాదంబుతోడ గాఢాంధకారంబు గోచరించు, నయ్యంధకారంబున నిర్భయుండవై కొంతతడవు నడిచితివేని యరుణోదయంబునఁ బ్రాగ్దిశాముఖంబునంబోలె ధగద్ధగాయమానంబైన తేజఃపుంజంబు గానవచ్చు, నట్టియెడ నచ్చటి ఘంటానినాదంబు లాలకింపుచు నత్యానంద భరితుండవై గమనించు సమయంబున ననేకరత్ననిర్మితంబులైన క్రీడామందిరంబులు గోచరించు, నమ్మందిరంబులం గల్గు భేరీకారవంబు లాకర్ణింపుచు మునుముందు నడుచుచుండ సువర్ణలతావేష్టితంబులైన కనకవృక్షంబులతోడ నుద్యానవనంబులు జూపట్టు. అందలి వైభవంబు లభివర్ణింపుచు నచ్చటి

శంఖరవంబు లాలకింపుచుం జనుచుండు సమయంబున జ్వాలామాలా
కులంబయిన దావానలంబు గోచరించు. నంత నొక్కింతయైన చింత
లేక యయ్యనలంబుఁ జొచ్చి ముందుపడిచితివేని వలయాకారంబైన
సువర్ణపీఠమధ్యంబున వజ్రవలయంబును అందు ఇంద్రనీలవలయంబు
నుం గలయొక్క విశాలంబగున కొల్వుకూటంబు గానవచ్చు. నచ్చటి
మేఘనినాదంబు లాలకించుచు నించుకసేపు విశ్రమించి తేఱిచూచిన
యెడల ననంతకోటి భానుప్రభాభాస్వరంబై వలయాకారంబైన వజ్ర
పీఠంబున విద్యుల్లతాప్రకాశమానయైన యొక్క దివ్యకాంత, తాళ
మృదంగవేణువీణాద్యనేక మంగళధ్వను లుల్లసిల్లఁ గొల్వుదీర్చి
యుండు. నమ్మహావైభవంబు గన్నులంగాంచితివేని యనేకజన్మ
సమార్జితంబైన పాపసంచయంబు భస్మంబగు. నంత నమ్మహాదేవికి
సాష్టాంగనమస్కారం బాచరించి మునుముందు గమనింప ననతి
దూరంబున. 123

సీ. అరయంగఁ బ్రాచీన • మై సూక్ష్మకంటకాం
తము మోపనైన సం • తరము లేక
యంతట బరిపూర్ణ • మైనదై యుల్లోల
కల్లోలములు లేక • యుల్లసిల్లి
తనయందు బ్రహ్మాండ • తతులు బుద్బుదభంగి
సంభవస్థితి వినా • శములు జెంద
హానివృద్ధులు బొంద • కచలమై కాంచిన
కొలఁది నంతము లేక • కొనలుసాగి

గీ. పలుకులకు రూఢివర్ణింప • నలవిగాక
యద్భుతానంద మొప్పంగ • నవధియగుచు
నన్యమొక్కటి లేకనిం • డారినట్టి
శాంతినామక జలధి సా • క్షాత్కరించు. 124

గీ. ఆజలధిఁ గాంచినంత హా • హా! యటంచు
సొమ్మసిలు నీదు మిత్రునిఁ • జూచినీవు
భాగవత్వంబు నొందియా • వార్ధి నడుమఁ
గూలి తేలుచు నుందువు • గుర్తులేక. 125

కం. ఈకరణి నెన్నటికి నిఁక
రాకయుఁ బోకయును లేక • రమ్యాంబుధిలోఁ
లోకములు దిశలు కాలము
లేకయె క్రీడింతు వసమ • లీలల నెపుడున్ 126

సీ. అదిగదా! సనకాదు • లైనయోగులు యోగ
సిద్ధులై చేరి హ • ర్షించు నెలవు
అదిగదా! కపిలాదు • లైన సాంఖ్యులు విచా
రించి శోధించి సా • ధించు పదము
అదిగదా! కృష్ణాదు • లైన జ్ఞానులు తపో
బలముచేఁ దెలియు ని • శ్చల పదంబు
అదిగదా! వ్యాసాదు • లైన మౌనులు ప్రపం
చించి సూక్తులఁ బురా • ణించు వస్తు
గీ. వదిగదా! శ్రుతికన్యక • లాడుచోటు
అదిగదా! సర్వభూత జ • న్మాలయంబు
అదిగదా! భూతములలోన • నమరియుండు
నదిగదా! నీకు నాకు నై • క్యస్థలంబు. 127

గీ. అట్టి జన్మస్థలముఁ బొంద • నట్టివారి
బహుళశాస్త్రీయ విజ్ఞాన • భాగ్యమేల?
పటుతరానంత సామ్రాజ్య • పదవులేల?
వెతల కేకాక వట్టి జీ • వితములేల? 128

ఉ. ఈ నరజన్మమందు లభి • యింపఁగఁ జాలిన పూర్ణతత్త్వవి
జ్ఞానవిలాసమిూకఁ బెఱ • జన్మములందు లభింపనేరదె
జ్ఞానదశేంద్రియంబుల వి • హారముఁగట్టి పరాత్పరాను సం
ధాన మొనర్చు పూరుషులు • దారులు ధీరులు ధారుణీస్థలిన్. 129

వ. అని యానతిచ్చిన సద్గురుస్వామి నిగూఢ విజ్ఞానవాక్సుధానుభవం
బుచే సర్వతాపత్రయజ్వరుండనై, యమ్మహాత్మునిఁ, సంసార
దూషంబయిన మహారోగంబున కపూర్వధన్వంతరిఁగాఁ దలంచి, కరం
బులు ముకుళించి. 130

కం. శరణాగత జనదురిత
స్ఫురణ హరణ నిపుణ చరణ • బుధవినుతాంతః
కరణా! కరుణాభరణా!
సురుచిరబోధాగ్రగణ్య! సుబ్రహ్మణ్యా! 131

ఉ. ఎన్నఁడు నిట్టిబోధవిని • యేనియు నుండఁగలేదు వీనులం
గన్నుల నిట్టికోవిదునిఁ • గాంచియునుండఁగలేదు సత్యమే
నెన్నిభవంబు లెత్తితిను • నింతటి భాగ్యము నొందఁజాల నా
పన్నశరణ్య! నన్ను బహు • భంగుల సత్కృపనెంచికావరే. 132

క. మీకరుణ ముక్తికాంతకుఁ
బ్రాకటశుద్ధాంతపదము • బ్రహ్మసందా
నోకాంబునిధికి వేలయు
శ్రీకరమును భక్తజనవ • శీకరమనఘా. 133

ఉ. ఎన్నఁగఁ జిత్తవృత్తుల క • తీతులటంచు మునీంద్రులెల్ల నా
పన్నగశాయి నబ్జభవుఁ • బన్నగభూషణుఁ బ్రస్తుతింతురా
మున్నసవారికబ్బిన శ్రీ • మంబుఁ దలంపఁగ నిట్టిసంతతా
సన్నమహాప్రబోధమయి • సాగరలీనతఁగాంచుటంగదా! 134

ఉ. మేదినిఁ గల్గునర్థముల • మీఱ తెలుంగని సూక్ష్మభావమెం
దేదియు లేదు తొల్లి జగ • దీశుఁడు శౌరి సురాసురాళినా
సాదనజేసి దుగ్ధమయ • సాగరమందు సుధారసాదికో
త్పాదనజేసెనంచు బహు • ధావచియించుఁ బురాణరాజముల్. 135

గీ. మధురమగునిట్టి క్షీరాబ్ధి • మథనకథను
బూర్వ యోగీశ్వరులకు మె • ప్పులుఘటించు
నాంతరార్థంబు గలదందు • రార్యజనులు
తెలియఁ బాత్రుఁడనేని బో • ధింపుఁడనఘ! 136

వ. అని విన్నవింప సుప్రసన్నంబైన ముఖారవిందంబున మందహాసవికా
సంబు దళుకొత్తఁ గృపారసాయత్తంబయిన చిత్తంబున నమ్మహా
త్ముండు నా వరకథా విధానంబు దెలియ నిట్లనియె. 137

గీ. కలశ పాథోధి మథన మె • క్కటియెకాదు
జగతిఁగల్గిన చారిత్ర • జాలమెల్లఁ
బ్రకృతి మోహావృతులకొక్క • భంగిఁదోఁచుఁ
బరమయోగుల కింకొక్క • పగిదిఁదోఁచు. 138

ఉ. తామసదృష్టికిం జనక • దారసుతాతనుజానుజాదినా
నామయమౌ జగంబు, మన • నంబున మౌనికి నొక్కయాత్మ మా
పైమది దోఁచుభంగి వివి • ధాది పురాణ చరిత్రలంతరా
రామకథావిధానవివ • రంబుగ మాఱును యోగికెన్నఁడున్. 139

గీ. అందు క్షీరాబ్ధిమథన మ • త్యంతసరస
మమితగూఢార్థ మాత్మబో • ధైకరూప
మగుచు విలసిల్లు దానియ • ర్థమెల్ల.
దెలియ వివరింతువినుము ని • శ్చలత వెలయ. 140

సీ. బహుకాలమూఁదిగాఁ • బ్రకృతి వేశ్యాలోలుఁ
డై జీవదశఁ జెంది • యశివమైన

సంసార మొసరించు • జగదీశుఁడగుభర్త
గతికిఁ జింతిలి కుల • కాంతయైన
మోక్షలక్ష్మి గడంగి ముయ్యేఱు లోకచోటఁ
గలిసిన విపులసా • గరమునందుఁ
బడిపోవ నది మొదల్ • పడఁతిజాడ యొకింతఁ
గనలేక యతఁడు దుః • ఖంబుజెంది

గీ. సత్యమగు నొక్క యాప్తసూ • చనముచేత
సతియొనర్చిన సాహస • స్థితి నెఱింగి
యుద్ధరింపఁగఁ దలచి స • మిద్ధమైన
యూహనూహించె సదుపాయ • మొకటిజేయ. 141

సీ. కామాదిదైత్యవ న • గ్గము జూపునట్టి వి
క్రమమున కోడిదూ • రస్థమైన
శమదమాదిసుపర్వ • సంఘంబు రావించి
రెండు సేనలకు మై • త్రిని ఘటించి
గురువాక్యమనెడి మం • దరగిరిఁ దెప్పించి
యలత్రికూటమను క్షీ • రాబ్ధి నడుమఁ
బొలుపొంద నిడిమనో • బుద్ధ్యాత్మకంబైన
యాదిశేషుని గొండ • నంటఁజుట్టి

గీ. వృత్తులనియెడు శిరములు • వేయిగల్గు
మనసనుఫణంబుఁ గామాది • దనుజులకును
మొలసియేకాగ్రమగు బుద్ధి • యనెడిపుచ్ఛ
భాగముశమాదిదేవతా • వళికొసంగి. 142

కం. ఘనతర దీక్షన్ వారలు
మననని దిధ్యాసలనెడు • మథనము జేయన్

మునుదాను తటస్థుండై
కనుఁగొనుచుండంగఁ గొంత • కాలంబునకున్. 143

మ. తొలుతన్ బ్రాకృతలీలనున్న తటినీ • తున్సక్యంబు సంధించుచుం
గలయం దన్నలరించు జాలి ఘనరా • గద్వేష సంపూరితై
లలితంబైన ప్రపంచకంబిపుడు గీ, లాజాల మొప్పన్ హాలా •
హలమైతోఁచెను దాని జూడఁగ నన • హ్యాంబయ్యె నప్పట్టునన్. 144

గీ. అట్టి హాలాహలంబును • బట్టలేక
ప్రకృతిపురుషుల ద్వంద్వభా • వంబుకలిమి
శబలితంబైన యజ్ఞాని • సంఘమనెడి
యీశ్వరునకు సమర్పించె • నిరవుమీఱ 145

వ. అంత నిహాముత్రార్థఫలభోగ విరాంగబను కల్పభూరుహంబు జనించి యాచ్ఞాదైన్యంబు శూన్యంబుఁ గావించె. నాత్మానాత్మప్రబోధంబను పూర్ణచంద్రుం డుదయించి యజ్ఞానాంధకారకబు నిరాకారంబుఁ జేసె. సర్వోపరంభోపరతియను కామధేను వుద్భవించి చిత్తవిశ్రాంతి యను క్షీరపూరంబు నపారంబుగా నొసంగె. శుద్ధసత్వంబను సుధా కలశంబు సముత్పన్నంబై గుణత్రయంబను జరామరణభయంబు నివారణంబు గావించె. సర్వబంధవిముక్తియను శ్రీమహాలక్ష్మి యవతరించి కించిద్జ్ఞత్వంబను బహుజన్మదారిద్ర్యంబు నిర్మూలంబుజేసె. "నహంబ్రహ్మాస్మి"యను నైరావతంబు జనించి దేహాహంకారమను మాయాగజంబు నదృశ్యంబుఁ గావించె. మఱి ధీరత్వమను నుచ్చైశ్రవమ్ముద్భవించి నిర్భయమ్ముగాఁ బరిభ్రమింపసాగె. సర్వబ్రహ్మాకారవృత్తులను నప్సరోజనంబులు జనించి యంతరంగంబున నభంగంబుగా నృత్యంబు సేయందొడంగె. నిట్టిమహోత్సవసమయంబున దటస్థుండైన విష్ణుండు మోక్షలక్ష్మినిఁ జేపట్టి శుద్ధసత్వంబను సుధారసంబుఁ జాతుర్యంబుతోడఁ గానుకగా...

రాక్షసాంశయుక్తుల వంచించి శమదమాది దేవతాంశసమన్వితుల
కాసంగినం గోపించి దురాత్ములయిన రాక్షసలక్షణులు దేవతా
స్వరూపులైన పరమసాధువుల నకారణంబు బాధించుచుండుట
నేటికిని సహజంబై ప్రవర్తిల్లుచుండె. 146

కం. వ్యధనణంచు నాసుధాంబుధి
మథనకథన్ వెలయుతత్వ • మార్గమునీకున్
గథనమొనర్చితి దీనన్
నిధనభయంబుడుగు భక్త • నివహంబునకున్. 147

గీ. ఇంకఁ ద్రిపురాసురులు నిరా • తంకశౌర్య
గరిమ వెలయంగ విబుధులో • కంబుఁ బఱపు
వెతలఁ గనుఁగొని భీకరా • కృతిని వారి
రుద్రుఁడు హరించు తెఱఁగు వా • కృత్తు వినుము. 148

గీ. కలదిలేనట్లు లేనిది • కలిగినట్లు
గానఁబడఁజేయు పెనుమాయ • గల్గువాఁడు
ఎట్టివారి కజేయుఁడై • నట్టివాఁడు
ఘనతరాజ్ఞానమను పేరఁ • గలఁడు మయుఁడు. 149

కం. ఆమయుఁడు బంధుజనహిత
కాముండై స్థూలసూక్ష్మ • కారణములనం
గామొనయు మూఁడు పురములు
భూమిన్ విహరింపఁజాలు • పోల్కి సృజించెన్. 150

కం. బాగుగ నాత్రిపురంబుల
రాగద్వేషాదిదుష్ట • రాక్షసతతికిం
ద్యాగముసేయుఁగ వారను
రాగమునఁ జరించిరా పు • రంబులతోడన్. 151

సీ. కనుదోయిఁ గనుగొన్న • కాంతామణుల నెల్ల
            జెఱఁబట్టి వెతలపాల్ • జేసె నొకఁడు
తనవారి కపకార • మొనరించె నితఁడంచు
            నవిభుని వెడలి వే • ధించె నొకఁడు
అవని నింపైనవ • స్తువులెల్లఁ దెప్పించి
            తన కగ్గముగఁ జేసి • కొనె నొకండు
తనకోర్కెలకు విఘ్న • మొనరించె వీఁడంచుఁ
            గ్రోధించి యుదధిలోఁ • గూల్చె నొకఁడు

తే. ఒరుఁడు ధనసాటిగాఁడని • మురిసె నొకఁడు
పరులకల్మికి నోర్వక • పొఱలె నొకఁడు
పరధన మడంచుకొని దుఃఖ • పఱచె నొకఁడు
పలువిధంబుల నెగసిరి • పలువురపుడు. 152

ఉ. ఈగతిఁ గ్రిందు మీఁదెఱుఁగ • కెంతయుఁ గ్రొవ్వునఁ దూలు మన్మహా
భాగుఁ బంచవింశుఁడను • వాసవుని భవరూప ఘోర కా
రాగతుఁ జేసి యువ్విభుని • రాశివృత్తిని జంటఁ బాపినా
నాగతులం గలంచె భట • నాథుల నెచ్చట నిల్వనీయకన్. 153

క. అద్వైత్యాలోపద్రుదు చేసు
ద్వైదములకుఁ గలఁగి తొలఁగి • శమదమముఖస
ద్వాదిత్యనికరము త్రతి
భేదమునఁ గ్రమక్రమముగఁ • గృశియించెనొగిన్. 154

వ. ఇట్లు కంఠగతప్రాణంబై తేజంబు దప్పియున్న దేవతానీకంబు నిజ
స్వామికిం గల్గిన మహోపద్రవమునకుం దల్లడిల్లుచు నివ్విధంబునఁ
జింతింపం దొడంగె. 155

సీ. అఖిలంబుఁ దన్నుగా • నరయఁగల్గినవాఁడు
            నిత్య నిరుపాధిక • నిరతిశయుఁడు

కమలజాండములెల్లఁ • గల్లగాఁ గనువాఁడు
ధనధాన్యముల కుబ్బి • తాండవించె.
బరమసాధ్వని వృత్తి • పత్నిగాఁ గలవాఁడు
వేశ్యయైన ప్రవృత్తి • వెంటనంటె
సంతతానంద భా • స్వరశీలుఁడగువాఁడు
బహుళదుఃఖాబ్ధిలోఁ • బడి మునింగె

గీ. తానుతానై మెలంగెడు • తాత్వికుండు
తన్నెఱుంగక భ్రాంతుఁడై • తల్లడిల్లె
నయ్యయో! యెట్టి దుష్కాల • మరుగుదెంచెఁ
గతలు కడతేఱి యెన్నఁడీ • వెతలు దీఱు. 156

చం. తన కనుసన్నలయ్యె నెవరు • దప్పక తన్నలరించు ధర్మప
త్నిని నెడఁబాపి రోఁ వెలఁది • తీపుల పాలుగఁజేసి దానిచేఁ
దన విభవంబు నెల్ల బహు • ధానశియింపగఁ జేయుచున్నయా
దనుజుల మాయఁదూలి తనుఁదానయెఱుంగఁడు మోసమయ్యయో.

ఉ. మత్తిలిమేను క్రొవ్వనెడ • మద్యముఁ గుత్తుకబంటి ద్రాగియు
న్మత్తతఁజెంది వృశ్చికము • దాఁకి పిశాచము సోఁకి చీకటిం
గత్తెరబోనులోఁ దగిలి • కాళ్లును జేతులు దన్నుకొంచుఁ బెన్
దత్తఱమొందు వానరువి • ధంబునఁజిక్కెన ధీశుఁడక్కటా! 158

సీ. శ్రుతిశిఖావళులచేఁ • నుతియింపఁబడువాఁడు
పొడఁగాంచు నరులెల్లఁ • బొగడసాగె
జగదేకనాథుఁడై • శాసింపఁదగువాఁడు
పరులయాజ్ఞలకులోఁ • బడి యడంగె
నమృతమయాహార • మారగించెడువాఁడు
నీరసాన్నముల సం • తృప్తుఁడయ్యె

జగదతీతమహోచ్చ • సౌధంబుగలవాఁడు
కారాగృహమునందుఁ • గలఁగఁ [illegible]

గీ. జెల్లరే! క్రూరదైతేయు • లెల్లరేఁగి
స్ఫటికనిర్మల సంకాశు • సముఁ బోసిఁ
గట్టిగట్టిగ నట్టియు • కట్టుబెట్టు
చుండిరీవంతదెగుకాల • మును[illegible]

వ. అని నిర్జరానీకంబు శోకాతిరేకంబున వ్యాకుల[illegible]
కాలంబు జింతించుచుండ నెట్టకేలకుం ద్రిపురదానవ[illegible]
గమనకాలంబు సమీపింప నంత విధిప్రేరణం[illegible]

సీ. జ్వలదఖండాకార • సచ్చిదానందంబు
తలనున్న స్వర్లోక • తటినిగాఁగ
బ్రహ్మానుభూతిచేఁ • బ్రజ్ఞానమగు మనో
రేఖ చెంగటిచంద్ర • రేఖగాఁగ
శృంగాటకమునందు • శృంగారముగ వెల్గు
నలపరంజ్యోతి నే • త్రాగ్నిగాఁగ
నఖిలప్రపంచంబు • ననుభవించెడు నింద్రి
యములైదు పంచాస • నములుగాఁగ

గీ. దనమహాభూతినిట్లు గు • ప్తముగఁ జేసి
యవని మహనీయగురులీల • నవతరించి
నట్టియాదిశివుండు బో • ధాట్టహాస
కలితుఁడై యొక్కచోట సా • క్షాత్కరించె.

క. ఆ హరునిఁ జూచి దైత్య
వ్యూహంబులు తలలు వంచి • యుద్గతభీతిన్
దేహములు గడువడంకఁగ
హాహాధ్వనులెసఁగ మూర్ఛ • నందిరి పెలుచన్.

ఉ. అంతట నీయుదంతమును • నంతయెఱింగి శమాదిదేవతా
సంతతి సంతసంబొదవ • శాంతభయంకరుఁడైన శంకరుం
డెంతఁ గనుంగొనన్ మొదటి • చింతలడంగి వికాసమొప్పన
త్యంతఘనీతి భక్తిరస • తత్పరతన్ నుతియించిరీగతిన్. 163

సీ. సకలమూర్తులను స • ర్తకభంగి వెలయుట
చే మహానటసంజ్ఞ • చెలఁగెనీకుఁ
త్రిగుణముల్ నీచేత • దీపించుటనుజేసి
యరసి త్రిశూలాంకుఁ • డండ్రు నిన్నుఁ
బూర్ణానుభూతిచే • భువనముల్ హరియింతు
వటుగాన హరనామ • మలరెనీకు
సర్వరూపములచే • సర్వంబుఁ దెలియుదు
వటులౌట సర్వజ్ఞుఁ • డండ్రు నిన్ను

గీ. ఆవరణలేక యుంటది • గంబరుఁడవు
తుదిని బొందకయుంట మృ • త్యుంజయుఁడవు
గాన కేవలశివమూర్తి • వైన నిన్ను
జెప్పఁదగుదుమె! ద్విసహస్ర • జిహ్వలున్న. 164

ఉ. దేవ! మహానుభావ! భవ • దీయకటాక్షము సోఁకకుంటనీ
దావమహోజ్జ్వలుల్ త్రిపుర • దానవులందఱు గుంపుగూడిమా
దైవతసార్వభౌముని ని • తాంతవిషాదము పాలుజేసి మ
మ్మావగనిల్వనీక కృశి • యింపగఁజేసిరి గాసిపెట్టుచున్. 165

ఉ. కావున ఘోరదానవులఁ • గల్మషచిత్తుల రూపుమాపి మా
దేవుని సత్యసంధుని సు • ధీనిలయుం జెఱనుండిబాపి మా
దేవిని వృత్తి రాణికి న • ధీనునిఁజేసి సమస్తదుఃఖముల్
బోవ ననుగ్రహింపుమిదె • మ్రొక్కెద మోయణిమాదిసిద్ధిదా! 166

వ. అని దీనభావమునం బ్రార్థించు సురనికరంబు ననుగ్రహింపఁ దలం
యమ్మహామహుండు సమరసన్నాహం బొనర్చుసమయంబున. 167

సీ. వివిధాంగముల్తోడ, వెలసి పార్థివమైన
యంగంబు విపులశ, తాంగమయ్యె
నారథంబునకుఁ బొ, ల్పగు సూర్యచంద్ర స్వ
రంబులు మహితచ, క్రంబులయ్యె
నతిశీఘ్రగతితోడ, నరుదెంచు వేదవా
క్యంబులు జవతురం, గంబులయ్యె
విశ్వసృష్టికిమూల, బీజమై రెండవ
ధాతనాఁదగు బుద్ధి, సూతుఁడయ్యె

గీ. సారచిత్సాగరంబు తూ, ణీరమయ్యె
నట్టి తూణీరమున నుండి, యసమమైన
“తత్త్వమసి” యను హరిశర, ధారనాట
త్రిపురదైత్యులు గూలి రో, క్కపరిగాఁగ. 168

కం. ఇదిత్రి పురాసురవరకథ
నుదయించిన తత్త్వసార, మొప్పఁగదీనిన్
మదిభావించి గ్రహించిన
మొదలింటి రాక్షసులబాధ, మొనయదువత్సా! 169

వ. ఇంకఁ గాళీయమర్దన ప్రకారంబు జెప్పెద నాకర్ణింపుము. 170

సీ. వివిధ వృత్తులతోడ, వెలసిన చిత్తంబు
బహు ముఖంబులతోడి, పడగఁగాఁగ
స్ఫురిత రాగద్వేష, ములు ద్విజిహ్వలుగాఁగఁ
గామాది గుణములు, కనులుగాఁగ
నుదయదీర్ష్యాసూయ, లుగ్రదంష్ట్రలుగాఁగ
నింద్రియగతులు ఫూ, త్కృతులుగాఁగ

విలసితత్రిపుటులు • విషకోశములుగాఁగ
సహజవహా మఱపుని • షంబుగాఁగ

గీ. నలయహంకృతి దీర్ఘదే • హంబుగాఁగఁ
గర్మగతులు నిగూఢాంఘ్రి • గతులుగాఁగ
సరవి నిచ్ఛయనిచ్ఛయు • సతులుగాఁగఁ
గలఁడు జీవాత్ముఁడను నొక్క • కాళియుండు. 171

క. ఆకాళియుండు తనువను
నాకాళిందీహ్రదమ్ము • నందుండి నిజ
ప్రాకట విషపూరముచే
నాకులతం బొందఁజేసె • నా మడుఁ గల్లన్. 172

గీ. ఆమడుఁగు డాసినంత నే • ప్రాణియైన
ఘోరమైనట్టి తద్విషా • సారకలన
నాత్మవిస్మృతి జెంది య • నంతతాప
బాధలను సొమ్మసిలుట స్వ • భావమయ్యె. 173

శా. ఆ లోకాపదఁ గాంచి జాలివడి లో • కానుగ్రహాయత్తతన్
లీలామానుష విగ్రహుండనఁగ క్షో • ణిం బుట్టి యోగీంద్ర హృ
ల్లోలుండౌ గురు వాసుదేవుఁడు మహో • ద్యోగంబు వాటిల్లఁ ద
త్కాళిందీనదిఁ జొచ్చి బోధమథనో • త్కంపంబు గల్గింపగన్. 174

మ. చిరకాలంబున నుండి యమ్మడుఁగు లో • సీమ౯ సుషుప్తిక్రియా
పరతన్ నెక్కొనియున్న కాళియుఁడు శుం • భన్మంథనప్రక్రియ౯
హరిసమ్మర్దముఁ జేయ మేల్కొని మహా • నాదంబుతో లేచి యా
సరసీగర్భమునుండి వెల్వడియె నా • శ్చర్యంబవార్యంబుగన్. 175

కం. వెలువడిన భుజగపుంగవు
తల నెక్కి తదీయపుచ్ఛ • తల మొకచేతన్

మెలివెట్టి పట్టిహారి ని
స్తులముగ న ర్తనముసేయఁ • దొడఁగెన్ వడిగన్. 17

సీ. నిగమచతుష్టయా • సీతవాక్తత్వార్థ
వివృతితోఁ గొంత తాం • డవ మొనర్చి
వివిధోపనిషదుక్త • విషయబోధన కళా
శక్తితోఁ గొంత లా • స్యంబు సల్పి
తతభాగవతసూక్తి • గతరహస్యాఖ్యాన
ధాటితోఁ గొంతనృ • త్యంబుజేసి
బహుసనాతనయోగి • వరసంప్రదాయల
క్ష్యములతోఁ గొంతనా • ట్యం బొనర్చి

గీ. శతశిరంబులు నొకమాఱు • జదియఁ ద్రొక్కి
సహజవిషమెల్లఁ గ్రక్కించి • చలమడంచి
క్రూరదశఁ బాపి శాంతి వి • స్తారుఁ జేసి
యద్వయానందవారాశి • కంపె నతని. 17

క. ఇది కాళీయ విమర్దన
విదితరసాయనము దీని • వెలయఁగఁ గొనినన్
సదమదమగు దురహంకృతి
మదసర్పోపద్రవంబు • మహిఁ భక్తులకున్. 17

ఉ. ఈధరణీస్థలిన్ వెలయు • నెల్లపురాణములందు సన్మునుల్
బోధయొనర్చు గాథలకుఁ • బొందుగనీగతి నంతరార్థముల్
మాధవపాదపద్మ లస • మానసమంజస భక్తియోగ సం
శోధిత చిత్తులైన సర • సుల్ మదినిల్పి చరింతు రర్భకా! 17

వ. అని యానతిచ్చు నమ్మహాత్ముని హృదయసాగరమునుండి మఱి యె
న్నెట్టి వాగ్రత్నంబులు బయలుదేఱునో యని యాదరాయత్త చిత్తు
డనై యుండు నవసరంబున. 18

చం. ఘనతర రాజయోగుల య • ఖండ సమాధులయందు దీప్తద
ర్శనుఁడగు చిత్ప్రభాకరుఁడు • బ్రహ్మ సముద్రమునందు నీగతిన్
మునుఁగునటంచుఁ దెల్పుగతి • ముజ్జగముల్ వెలిగించుచుండునా
దినకరుఁడ స్తమించె నతి • ధీ రతనయ్యపరాంబురాశిలోన్. 181

వ. అంత మద్గురుస్వామి సాయంకాల విధానంబు నెరవేర్ప నుత్సుకత్వం
బుతో లేచి జపనికేతనాభ్యంతరంబుఁ బ్రవేశించి యపార పరమా
నంద పారావార విహారంబులఁ గొంతకాలంబు గడిపి మఱునాఁటి
యరుణోదయంబున లేచి గురుపరంపరాభి వందనంబుఁ గావించి
స్నానసంధ్యాద్యనుష్ఠానంబులు నిర్వర్తించి సస్మితావలోకనంబుల
నన్నవలోకించి యిట్లనియె. 282

చ. నరుల విమోహబుద్ధిఁ బడు • నాల్గుజగంబులు సర్వదేవతా
పురములు సర్వదేవతలు • బోల్పఁ బరోక్షమునన్ వసింతురం
చరుదుగఁ జూచుచుందు రది • యంతయుఁ జక్కనిత్రోవగాదు స
త్పురుషులు గాంచుమార్గముఁ బ్రమోదమునన్ వివరింతుఁబుత్రకా!

ఉ. స్థావరజంగమాత్మమగు • సర్వమునుం దనయందుఁగల్గి మా
యావశతన్ బహిర్లసిత • మై యెఱుఁగంబడుచుండుఁ బూర్ణని
ద్రావసరంబునందుఁ దన • యందునఁ దోఁచిన స్వప్నలీలమో
హావిలవృత్తి బాహ్యగత • మై తెలియంబడు పోల్కినర్భకా! 184

కం. తన తనువున సర్వముగల
దని మనమున రూఢి • నెఱిఁగి యఖిలాత్మకుఁడై
వాఁడు మనుజుఁడు త్తమోత్తముఁ
డని శ్రుతులు వచించునిదియ • థార్థమువత్సా! 185

వ. అది యెట్లంటివేని వినుము మూలాధారంబు మొదలు సహస్రారంబు
వఱకు నూర్ధ్వలోకంబు లేడునుం బ్రకాశింపుచుండు నందు మూలాధా

రంబు భూలోకంబును, స్వాధిష్ఠానంబు భువర్లోకంబును, మణిపూ
రంబు సువర్లోకంబును, అనాహతంబు మహర్లోకంబును, విశుద్ధంబు
జనలోకంబును, ఆజ్ఞేయంబు తపోలోకంబును, సహస్రారంబు సత్య
లోకంబునుంగా నెఱుంగవలయు. 186

సీ. తప్తకాంచన వర్ణ • దీప్త మహాకాశ
మధ్యమందొక్క ప • ద్మంబు దనరు
నాపద్మమున వాది • సాంతవర్ణంబుల
రమ్యంబులగు చతు • ర్దళము లమరు
నా దళంబుల నిల్చి • నట్టి హేమ స్తంభ
ముల దివ్యమంటపం • బలరుచుండు
నా మంటపమునఁ బా • శాంకుశమోదక
దంతభూషిత హస్త • కాంతుఁడగుచు

గీ. వల్లభాలక్ష్మి వామ పా • ర్శ్వమునఁ గులుకఁ
గంధభోక్తృత్వము నివృత్తి • కళయుఁగలిగి
యలక్రియాశక్తితో వినా • యకుఁడు వెలయు
నిదియె భూతత్వమాధార • మిదియె వత్స ! 187

సీ. రక్తోత్పల ప్రభా • రాజితంబగు విశా
లాంబరమ్మున బాది • లాంతవర్ణ
ములవెల్గు షట్పత్ర • ములుగల్గు కమలంబు
దనరారు దాని ష • డ్దళములందు
పద్మరాగ స్తంభ • భరితమై మహనీయ
పుష్పకంబొకటి సొంర • పుగఁ జెలంగు
తన్మధ్యమున శార • దాయుక్తుఁడై కమం
డలు వరాభయమాలి • కలఁ దనర్చి

[7]

గీ. భుజములమరంగ షడ్రస • భోక్తయగుచు
శక్తి యిచ్ఛయుఁ గళత్రతి • ష్ఠయును గలిగి
ధాత వెలుఁగొందు నిది జల • తత్త్వమనఁగ
మఱి యధిష్ఠానమన వచిం • పఁదగుఁ బుత్ర! 188

సీ. కర్ణికాపరాగ • వర్ణాంబరంబున
డాదిఫాంతాక్షర • వ్యాప్తములగు
దశదళంబులతోడఁ • దనరు నీరజమందు
దళమున కొక్కటై • కళలు జిమ్మ
గారుత్మత స్తంభ • గణముతో విలసిల్లి
డంబుమీఱెడి విమా • నంబు నందు
శంఖచక్రగదాబ్జ • సహితచతుర్బాహుఁ
డగుచు వక్షమున క్షీ • రాబ్ధికన్య

గీ. వన్నెమీఱంగ రూపాను • భవము గలిగి
జ్ఞానశక్తియు విద్యాక • ళానుమోద
ముల్లసిల్లంగ వైకుంఠుఁ • డుండునిదియె
యనలతత్త్వంబు మణిపూర • మనఁగ వత్స! 189

సీ. సాంద్రశరచ్చంద్ర • చంద్రికోజ్జ్వలపుష్క-
రాంతరమ్మున కాది • రాంతబీజ
విశదంబులైన ద్వా • దశదళంబులతోడ
విలసిల్లు పికచార • విందమందు
స్ఫటికమయద్వాద • శ స్తంభముల నొప్పు
మంటపంబున నుమా • మహిళతోడఁ
బరశుమృగాభయ • వరసమన్వితచతు
ర్బాహుఁడై స్పర్శాను • భవముగలిగి.

గీ. శాంతికళతోడ మఱి యాది • శక్తితోడ
గూడి చర్మాంబరుండు త్రై • గుణ్యహరుఁడు
హరుఁడు వసియించు నిది య • నాహతమనంగ
వాయుతత్వంబనంగ నే • ర్పడియెఁ బుత్ర! 19

సీ. ఇందీవరశ్యామ • సుందరాభమునందు
షోడశస్వరపరి • శోభితంబు
లగు షోడశ దళంబు • లమరంగ రుచిరమై
రాజిల్లు విపుల స • రోజమందు
హరినీలరత్న ర • మ్యస్తంభములతోడఁ
జకచకలీను పు • ష్పకమునందు
అంకుశపాశవ • రాభయ కోదండ
శరయుక్తభుజ చతు • ష్టయము దనరఁ

గీ. బత్తి చిచ్ఛక్తిగాఁగ శ • బ్దప్రబోధ
సహితుఁడై పరశక్తియు • శాంత్యతీత
కలయు వెలుఁగొంద జీవాత్ముఁ • డలరు నిదియె
తగువిశుద్ధంబు నాకాశ • తత్వమనఁగ. 19

గీ. మహిత మాణిక్య వర్ణాభ • మధ్యమందు
హాక్షవర్ణాఢ్య పత్రద్వ • యాంబుజమునఁ
దగు పరంజ్యోతిఁ కళయు జి • చ్ఛక్తి గలిగి
వెలుఁగు పరమాత్ముఁ డాజ్ఞేయ • పీఠమిదియె. 19

సీ. భానుకోటి ప్రభా • భాసురంబగు మహా
కాశవీథిని సుప్ర • కాశమైన
దళసహస్రమునందు • లలితపంచాశద
క్షరపంక్తులిర్వది • వరుసలొప్ప

జలజపీఠిని సహ • స్రస్తంభములతోడఁ
గాంచిన కోలఁది న • ఖండమగుచు
మహనీయమైన వి • మానమధ్యమునందు
శాంతసంశుద్ధతే • జంబుతోడఁ
గీ. ప్రబలి శుక్లాంబరములు క • ల్పతరుకుసుమ
మాలికలు జందనంబు కెం • గేలనొకట
జ్ఞానముద్రయు వెల్గొంద • సద్గురుండు
దనరు నిదియె సహస్రార • మనఁగవత్స! 193

క. సప్తభువనంబులనఁగను
సప్తసరోజములు సప్త • చక్రములనఁగా
గుప్తార్థవేకలివియని
యాప్తులకుం బల్కుదురు స • మాహితబుద్ధిన్. 194

ఉ. ఈ భువనంబులేడు బర • మేశ్వరుఁడైన చిదాత్మలోన మ
హాభమహోదరంబున ర • హింబొరలాడెడు వెల్గకాయలై
శోభిలుచుండు నాప్రభునిఁ • జూడఁగ యోగులుదక్క మోహదు
ర్లోభమదాంధులెట్లు? తమ • లోఁ గనఁ జాలుదురెన్నిబాములన్.

సీ. క్షరమైన మేను శా • శ్వతమెన్నఁటికిఁగాదు
శాశ్వతాత్మునకు నా • శంబులేదు
ఏ పరాత్పరవస్తు • వీ చరాచరమెల్ల
వ్యాపించె నదియె ని • త్యంబుసుమ్ము
ఆయవ్యయాత్మకు • నంతంబు గల్గింపఁ
గా నెవ్వరికిని శ • క్యంబుగాదు
అప్రమేయంబు ని • త్యంబు నవ్యయమైన
యాత్మకు స్థూలదే • హంబువలన

గీ. జననమరణాద్యవస్థలు • సంభవించి
నట్లు దోఁచునుగాని స • త్యముగ లేవు
గాన సంశయముడిగి ది • వ్యానుభూతి
సమ్మదమునింపు మోహపా • శమును ద్రెంపు. 196

చం. సకల నిజాంగ సంఘముల • సాంద్రత నిండిన యీ పరాత్మనే
యొకఁడు మహాద్భుతంబనుచు • నుద్ధతిమీఱఁగఁ జూచుచుండు వే
ఱొకఁడు విచిత్రతంబలుకు • నొక్కఁడు వింతగ నాలకించు నీ
వికలజనుల్ గనుంగొనియు • వింతగఁ బల్కియు నాలకించితా
మకట! పరోక్షులై చెడుదు • రా హరిమాయప్రభావమెట్టిదో!

ఉ. ఏనరుఁడాత్మతృప్తివహి • యించుచు దాను తనందపూర్ణమో
దానుభవప్రకాశుఁడగు • నాతనికిన్ విధియెందులేదు లో
కానుగుణ ప్రవర్తన నొ • కప్పుడు జేయ ఫలంబు లేదు దా
మాననఘంబు లేదు సుర • మర్త్యుల వాంఛయు లేదు వానికిన్. 198

చం. అమృతముఁ గొన్నవాని కిత • రాన్నములింతయుఁ బ్రీతిగాని చం
దమున మహామహున్మని గ • ణ స్తవదూరునిఁ జిన్మయాత్మునిన్
బ్రమదముమీఱఁ గాంచుచు న • పారసుఖంబునఁ జొక్కుచున్నయా
సమరసభావతృప్తుల క • సారసుఖంబు రుచింపనేర్చునే. 199

సీ. మరుమరీచికలలోఁ • దిరుగులాడెడువాని
కెంతటి తనుతాప • శాంతికలదో!
స్వప్నలబ్ధములైన • షడ్రసాహారముల్
దినువాని కెంతటి • తృప్తిగలదో!
ఆకాశకుసుమంబు • నవతంసముగ జేయు
నరుని మౌళికి నెంత • యొప్పుగలదో
శుక్తిలో భ్రాంతితోఁ • జూడఁదోఁచిన రూప్య
మున నెంత యుపయోగ • ఘనతగలదో!

గీ. తఱచిచూచినఁ బ్రకృతి యం • తటిదె గాని
యెంత నమ్మించినను సత్య • మింత లేదు
జలమునంటని జలజినీ • దళమువోలె
నంటకుండిన నిను శోక • మంటదెపుడు. 200

చ. ఇరవగు నాత్మతత్త్వము త • దేకమతిం జరియించు సంయమీ
శ్వరులకుఁ జేరువై కడున • పారభవాంబుధిమగ్నులైన పా
మరులకు దూరమై యలరు; • మాధవపాదసరోజముల్ మన
స్సరసిని నిల్పినన్ వెడలఁ • సాగుఁ బ్రమోదరసప్రవాహముల్. 201

సీ. గగనవీథిని నెంత • కాలంబు నారాచ
మతిశీఘ్రగతితోడ • సరుగుచున్న
నరిగినకొలఁది న • నంతమై కడముట్టఁ
దరముగానట్టి యం • బరము పగిది
బాహ్యాంతరంబులఁ • బరిపూర్ణమై నిరం
తరమైన యయ్యాత్మ • తత్త్వమందు
శరవేగమున మాన • సం బెంత బాఱినఁ
గదలకుండియు దానిఁ • గడచి యుండు

గీ. కర్ణములులేక వినుచుండుఁ • గనులులేక
కాంచుచుండును మఱి చేయి • కాలులేక
కొనుచు నడుచుచు నుండు ని • ర్గుణము నయ్యు
సగుణమైయుండు హరివిలా • సంబు వత్స! 202

సీ. మనసుచే సకలంబు • మననంబు జేయించు
మనసున కెఱుఁగ గ • మ్యంబుగాదు
పల్కులన్నియురూఢిఁ • బల్కించుచుండు న
ప్పలుకుల కందంగ • నలవిగాదు

చూపుల విశ్వంబుఁ • జూడ దక్షతనిచ్చు
జూపుల నొక్కింతఁ • జూడఁబడదు
సర్వేంద్రియంబుల స • ర్వంబు మెఱయించు
నందు దేసికి విష • యంబుగాదు

గీ. మానసాదీంద్రియంబుల • మలఁచి కట్టి
మౌనము ధరింపఁ బరిపూర్ణ • మహిమనొందు
నహహ! యీపూర్ణతత్వంబు • ననుభవింప
స్వల్పతరమైన యింద్రియ • సమితి వశమె. 203

గీ. నింగి నోఱయుచు మిగుల ను • ప్పొంగుచుండు
జలధిపూరంబు దొరువులు • సైఁపనట్లు
సకలవిభుఁడైన హరివిలా • సము భరింప
మానసాదుల కిసుమంత • మహిమగలదె. 2

చ. అనయము నిర్వికారమగు • నా పరిపూర్ణమునందు లేనిదే
మనసన నుద్భవించి పటు • మాయనటించుచు స్వప్నముం జగ
బును బహువేదశాస్త్రముల • పూర్వపు విద్యలు వాదభేదము
గనఁబడఁజేసి చేసి మఱి • లన్ ముకుళింపఁగఁజేయు నింతగన్.

శా. వాసిన్మించిన సూత్రధారుఁడు మహా • ప్రౌఢిన్ జ్వలత్పట్టణ
ప్రాసాదాలయసుందరీ మృగఖగా • రణ్యాది చిత్రాకృతి
వ్యాసక్తంబగు పెన్దెరన్ మునుచుచో • య్యక్ విప్పుచు న్నా
ల్లాసంబుల్ నెఱయించుచుండుగతిఁ జ • త్తంబట్లు నర్తించెడున్

క. ముకుళింపఁగ నణువిధమై
వికసింప నజాండకోటి • విస్తారంబై
సకలార్థకారణంబగు
నకలంకమనఃప్రభావ • మలవియె తెలియన్.

గీ. పాంచభౌతిక మొకమాయ • ప్రబలఁజేయు
తనదు లోలోన జగ మొక్క • తఱిసృజించు
ఉభయమును మాపి పవళించు • నొక్కమాయ
మూఁడు మూర్తులు దానయై • మొనయునిదిగొ. 208

చం. ప్రళయమునందు సప్తజల • రాసుల నేకమహార్ణవంబుగా
నలరిన వేళఁ గ్రుమ్మరెడు • నాదివరాహము చోలె నెమ్మనం
బిల మొదలైన భూతముల • నెల్లను నొక్కటిమ్రింగి యద్వయా
చలపరిపూర్ణ తత్త్వమున • సంతతముఁ విహరించు నొంటియై. 209

గీ. ఇట్లు జరియించి చరియించి • యెట్టకేని
కండచక్కెఱ జలములోఁ • గలిసినట్లు
మది లయంబొందు నిదిజన్మ • మరణరహిత
శాశ్వతానందమయ శేష • సంజ్ఞపదము. 210

సీ. వితతమనోబుద్ధి • వృత్తి మండలతరం
గముల నంతంబులై • కదలుచున్న
నవని జలాది మ • హాభూతజాలమన్
ఫేనంబు రాసులై • పెఱుగుచున్న
సురనరపశుపక్షి • తరుకీటకాదిబు
ద్బుదములు వేనవే • లుప్పుచున్న
నిగమాగమపురాణ • నిఖిల విద్యానదుల్
పలుముఖంబులఁ దన్నుఁ • గలియుచున్న

గీ. నీ తరంగాదినానావి • కృతులు తుదకు
నణఁగినను స్వస్వభావమిం • తైనఁ జెడక
హానివృద్ధులు లేక ని • రంతరంబు
సమత దీపించు నమ్మహా • జలధియిదియె. 211

మ. పరతత్త్వంబను సన్మహాంబునిధి న, వ్యక్తంబు నానొప్పు నా
విరజన్మించి యదే మహత్త్వనఁగ దీ, ప్తిన్ మేఘమై దాన వి
స్ఫురితాహంకృతి చంచలాలతల దీ, ప్తుల్ నిండఁగా నీ చరా
చరముల్ నావడగండ్లురాలుచు నధి, ష్ఠానాకృతిన్ జెందెడిన్. 21

ఉ. ఆవిరి మున్నుగాఁగలుగు, నంతయు నీటజనించి యంత నీ
రై వనరాశి నైక్యమగు, నట్లు ప్రధానము మున్నుగాఁగ లో
కావళిదాఁక సర్వమును, నాహరి రూపముగాని యన్యస
ద్భావము లేదు నిక్కమిది, భావమునం బరికించి చూడుమా. 21

సీ. అఖిలంబు హరిరూప, మైన "దృశ్యం నశ్య"
మనెడు వాక్యార్థ మె, ట్లనఁగ వినుము
నాశంబనఁగ రూప, నామంబులణఁగి కా
రణమౌట గాని ప, రంబుగాదు
కనకంబు భూషణా, కారంబుగా మాఱి
కరగింపఁ గనక మై, పరగునపుడు
భూషణగతలతా, పుష్పపత్రఫలాది
కములు హేమత్వంబు, గాంచలేదె

గీ. అట్టుల భూమ్యాది సకల దృ, శ్యంబు క్రమతఁ
బరగ నొండొండఁగారణా, వస్థఁబొంద
మించి యావిష్ణుపదము శే, షించుఁగాన
హరికి నన్యంబు పరమాణు, వైనఁ గలదె. 21

సీ. పాంచభౌతిక భూత, పంచాంశములు మహా
భూతపంచకమందుఁ, బొలిసినంత
ధరణి కల్పక్షయో, ద్ధతమహాంభోధిలోఁ
గరగి కర్దమభంగిఁ, గలిసిపోవు

[8]

సమ్మహాజలధి యు । గ్రంబైన బడబాగ్ని
నెగుచు పెన్మంటల । నింకిపోవు
నామహానలము జం । ఝూమారుతోద్వృత్త
హతులచే మొదలంట । నాఱిపోవు

గీ. నల మహావాయువంబర । తలమునందుఁ
దిరిగి తిరిగియుఁ దుదకు శాం । తిని వహించు
నల నభంబు మహత్తత్వ । మెలమి మ్రింగు
దానినవ్యక్త తత్వము । ద్ధతిహరించి
తాను బరతత్వమందు మి । ధ్యాత్వమొందు. 215

కం. ఈకరణి భూతనికరము
రాకయుఁ బోకయును గలిగి । రాజిల్లంగా
రాకయుఁ బోకయు లేకయె
యేకగతిన్ వెలుఁగు నాప । రేశ్వరుఁడనఘా ! 216

వ. అని యానతిచ్చి మహావిభుండైన సద్గురుస్వామి యర్ధనిమీలితాక్షుండగుచు నిరంకుశ ప్రవాహయై నానారణ్య పర్వతోచ్ఛేదంబు గావించి సముద్రగామియై సముద్రత్వంబు గాంచు గంగాతరంగిణింబోలె వివిధభావసంకులంబయిన వాసనారణ్యంబు. భేదించుచు నంతర్వీథిపైఁ బ్రవహించు దివ్యబుద్ధినిం బరతత్వంబునందు లీనంబుజేసిఁ నిస్తరంగాబ్ధి చందంబు జెందియున్న యమ్మహాత్ముని స్వరూనుభవ బోధంబున నేనునుం బరిపూర్ణానందమగ్నుండనై నిరతిశయంబైన భక్తి యోగంబున నవాఙ్మనసగోచరంబైన యాపరమ పురుషుని విశ్వరూపంబు నిట్లని యభివర్ణించితి. 217

సీ. క్షితిమొల్ల నీకు వి । స్తృతనాట్యరంగంబు
గగనమండలము చా । కట్టుపుమాళి

# శ్రీ సద్గురు స్తవరాజము

నక్షత్రనికరములం • దలి దివ్యరత్నముల్
భూషచంద్రులు కర్ణ • భూషణములు
అతులసూర్యార్తి మీ • యరివర్గభయమూర్తి
చంద్రికావ్యాప్తి మీ • సాంద్రకీర్తి
భూనభోంతరసీమ • పాదలు మీ ఘనకుక్షి
జ్వాలానలంబు మీ • జఠరదీప్తి
వివిధసృష్ట్యము చతు • ర్విధభోజ్యములు మీకు
సప్తవాయువులు ని • శ్వాసచయము
వితతవర్షంబు మీ • స్వేదబిందుగణంబు
సప్తవారిధులు ను • త్సర్గజలము
అష్టదిక్కులు మీకు • నష్టబాహువులు బ్ర
హ్మాండపంక్తులు చేతి • యాటచెండ్లు

గీ. రేయి బవలును మీకంటి • ఱెప్పలార్పు
గాఁగ వర్తించునో మహా • కారదివ్య
సచ్చిదానంద ఘనయోగి • చక్రవర్తి!
అమలపథవర్తి! సుబ్బరా • యగురుమూర్తి! 218

ఉ. ఆపురుషోత్తముండు జగ • మందున ధర్మమునిండ ధర్మసం
స్థాపన మాచరింప నిజ • మాయ ధరించి జనింతునంచుఁ బా
ర్థాపదనాఁటి వాక్యము య • థార్థమొనర్పఁగ నిత్తఱిఁ భవ
ద్రూపమునం జనించె బహు•రూపిగ మమ్ములఁ బ్రోచుకాంక్షతోన్

గీ. ఇట్లు గాదేని మండలా • ధీశులైన
నందఁజాలని యుష్మత్కృ • టాక్షలహరి
కేవలాజ్ఞాన దుర్దశా • కీర్ణులమగు
నిట్టి మాయందు బ్రవహింప • నేల? దేవ! 220

సీ. కనుమూసి యొకభంగిఁ, గనుఁగొన్న విశ్వంబు
భగ్నమై యణురాశి • పగిదిమాఁచు
నల్లనల్లన నిల్చి • యంతర్ముఖంబైన
శబ్దాది తన్మాత్ర • సమితిగూఁలు
మఱిమఱి జూడంగ, మహదహంకారంబు
లవ్యక్త తత్త్వంబు, నందుఁగలియు
నంతంత మీఁద న • వ్యక్తాంధకారము
ద్భిన్నమై తొల్లింటి • వెలుఁగు వెలుఁగు

గీ. నట్టి యున్మని భావంబు, నంది యంది
యట్టె చూచినఁ బుట్టు బ్ర • హ్మాండ పంక్తు
లహహా! లయసృష్టులన బంతు • లాట మీకు
అతివిమలభావ! సుబ్బరా • యగురుదేవ! 221

సీ. జనియించు జగములే, స్వామి గర్భమునందు
నలఘుశుక్తికను ము • త్యములు వోలె
జరియించు నెవనిలో, సకలభూత గణంబు
జలరాశిలోన మ, త్స్యములు వోలె
నివసించు నే స్వామి, నిఖిల మూర్తులయందు
రత్నంబులందు సూ • త్రంబు వోలె
విలయించు సర్వమే, విభుని కభిన్నమై
ఘనరసంబున వడ • గండ్లు వోలె

గీ. అట్టి కారణమూర్తి బా • హ్యాంతరాత్మ
యొక్కఁడై వెల్గు నప్పురు • షోత్తముండు
వెలసి మీరూపమున నాకు • విదితుఁడయ్యె
అతివిశదబోధ! సుబ్బరా • యగురునాథ. 222

చ. అరుదగు స్వప్నరాజ్యమున • నాపరిపూర్ణవిశుద్ధతత్వమం
నెఱుకను చిత్రకారకుఁ డ • నేక విచిత్రములన్ లిఖింపఁగా
మఱపను వార్ధిఁ బొంగి మటు • మాయగ నన్నిఁటి మాప శేషమై
పరగిన యమ్మహాపదము • స్వామి! భవత్కృపలేక కల్గునే. 223

గీ. పగటితేజంబు రాత్రియం • దగు తమంబు
నంటకెప్పుడు శుచియైన • యింటిపగిది
నెఱుకమఱపులు తనయందు • దిరుగుచున్న
నమలమైయుండు మీస్వరూ • పము మహాత్మ! 224

సీ. క్రమమొప్ప బాల్యాది • గతవేదశాస్త్రముల్
వఱదఁగా జదివించు • వాక్కుచేత
తన యిచ్ఛకొలఁది బి • త్తఱపుఁ జిత్తరువులఁ
గరమొప్ప వ్రాయించుఁ • గరముచేత
తనసూటిచే సంధ • తమసమందును నర
ణ్యముదారి నడుపు బా • దములచేతఁ
మలమూత్రముల రాక • దెలిసి బహిర్గత
మ్మునగఁజేయు దద్ద్వార • యుగముచేత

గీ. భాను హిమభాను విద్యుత్కృ • శానుముఖ్య
తేజములకెల్లఁ దేజమై • యోజనెసఁగు
నట్టి యక్షరరుచి మీస్వ • యంప్రకాశ
సన్నిధిని విస్ఫులింగమో • చండతేజ! 225

చం. అలయిక యింత జెందక య • హర్నిశమీగతిఁ బూర్ణబోధనా
గ్జలనిధిఁ దేల్చుమీ ఋణము • సర్వధనంబును ధారవోసినం
బలుమఱునోఁట మీపరమ • పావననామము నుగ్గడించినన్
విలయ ముదాఁక మీచరణ • పీఠముఁ గొల్చినఁగాని తీఱునే. 226

సీ. మీపాదములు భక్తి • మెఱఁగి సన్నిధిఁగొల్చు
పుణ్యభక్తుల శిరో • భూషణములు
మీవాక్యములు సత్వ • మిళిత సజ్జనచిత్త
పేటికలను దాఁచు • మేటిమణులు
మీకటాక్షముల సం • భేద్య మోక్షకవాట
ఘటన భేదించు బీ • గంపుఁజెవులు
మీశాసనంబు న • మ్మి భజించువారి స
సారాబ్ధిఁ దాఁటింపఁ • జాలునావ

గీ. మీదు హృదయంబు శివకేశ • వాది నిఖిల
మాన్యసురశేఖర విలాస • మందిరంబు
ఆశ్రితాపనసాక్షాత్కృ • తావతార !
అరిగణవిదూర! సుబ్బరా • యగురుధీర! 227

గీ. పరశువేదిని సోఁకి సు • వర్ణమైన
యినుమునుంబోలె మీసుద • ర్శనఫలంబుఁ
బడసి నామది నిర్మల • స్ఫటికమయ్యె
నహహా! భువి నింతకన్నభా • గ్యంబు గలదె. 228

సీ. వెలయు నాత్మానాత్మ • విజ్ఞానమహిమంబు
మమతాభిమానంబు • మట్టుపఱచె
ననుపదంబును బుట్టు • నభినవానందంబు
శోకమోహముల బ • ల్వీఁకనడఁచె
నధికమై యుప్పొంగు • నమృతానుభవతృప్తి
యాశాపిశాచంబు • నణఁగఁ ద్రొక్కె
సకలోపనిషదర్థ • సారంబు విదితమై
సంశయంబులనెల్లఁ • జక్కడంచె

గీ. మీ మహామూర్తి నామనో • భూమి నిల్పి
హరిహరేంద్రాది సురలపై • నాసలుడిపె
సవితాత్మావలోకమా • ర్గానువర్తి
అఖిల నుతకీర్తి! సుబ్బరా • యగురుమూర్తి! 229

క. తారకమంత్రంబున ము
మ్మాత్ములుం జెన్నారంబల్కు • మహనీయములౌ
నారాము నామములకున్
వేఱర్థము గలదో! యొక్క • విధమో! తలపన్. 230

గీ. మూఁటికిని మూఁడుగా నర్థ • ములు పొసంగ
వలయు నేకాక యేకార్థ • పదములైన
జర్చసేయుంగ నొకవిశే • షంబుగలదో!
పైఁగఁ బునరుక్తివాద మే • ర్పడఁగలేదో! 231

కం. అదిగాక మూఁడు పదములు
కుదురుగ నమ్మంత్రమందుఁ • గూర్పగనేలా!
మదినిది కడుసందేహా
స్పదమై విలసిల్లు దీని • భావంబేమో. 232

ఆ. వె. తెలియపఱచినన్ను • గళిత సంశయుగాఁగఁ
జేయవలయునన్న • జిత్తగించి
యమ్మహాత్ముఁ డప్పు • డత్యాదరంబున
నానతిచ్చె నిట్లు • లధికకరుణ. 233

గీ. వసుధలోఁగల్గు నితరశ • బ్దంబులందుఁ
దలఁపఁబునరుక్త భావంబు • గలుగుఁగాని
రామనామంబునందు మం • త్రంబు నిజము
లేదు బునరుక్తభావంబు • లేశ వత్స! 234

మ. అమృతరసంబులాను సమ • యంబులయందు సపర్యలై సదు
ద్యములగు తేనెపానకము • లారగు వేళలమర్త్యులైన ని
క్కమురుచి దప్పిలో విసుగుఁగాంచిన గాంతురుగాక ! యెందు హృ
ద్యములగు రామనామసుధ • లానఁ బరాఙ్ముఖులౌదు రే! ఘనుల్.

తే. గీ. నామమొక్కటైన • భూమికల్ వేఱుగాఁ
బొందుపఱచి మూఁడు • భూమికలకు
మూఁడు నామములుగ • ముదమూఱఁగాఁ జేర్చె
యోజఁ గూర్చ మంత్ర • రాజమయ్యె. 236

గీ. ప్రథమనామంబు నిఖిలప్ర • పంచనాథుఁ
డైన శ్రీహరి దివ్యరూ • పానుభవ మొ
సంగి హరిభక్తి నానంద • జలధిఁ దేల్చ
ప్రథమభూమికగా నిల్పఁ • బడియె శ్రుతుల. 237

గీ. శ్రీయనగలక్ష్మి యిది మేప్ర • కృతియనంగ
రాముండననందు క్రీడించు • రమ్యమూర్తి
ప్రకృతితోఁగూడి సర్వప్ర • పంచసృష్టి
మహిమ నెఱవేర్చువాఁడె రా • మప్రభుండు. 238

సీ. వాణితోఁ గవగూడి • వారిజాసనుఁడన్న
విఖ్యాతి విలసిల్లు • విభుఁడతండె
గౌరి యర్ధాంగిగాఁ • గడలేని యానంద
వార్ధి నోలాడు నీ • శ్వరుఁ డతండె
లక్ష్మితోఁగూడ బా • ల్కడలిఁ బన్నగశాయి
యైయున్న బుండరీ • కాక్షుఁ డతఁడె
శచితోడ సమధికై • శ్వర్య భోగవిలాస
తత్పరుండైన సు • త్రాముఁడతఁడె

సీ. వారు వీరననేల దే • వతలు మునులు
ఖచర కిన్నరయక్ష రా • క్షసులు నరులు
ఖగమృగ భుజంగ క్రిమి కీట • కముల వఱకుఁ
దంపతుల్ తత్స్వరూపమై • తనరు వత్స! 239

కం. వీరలు పరికరముగ దై
వారగఁ బరిదృశ్యమా ప్ర • పంచం బెల్లన్
వారక సృజించి సర్వా
ధారుండై యుండు నయ్యు • దారుం డరయన్. 240

ఉ. అమ్మహనీయ తత్త్వము స • మాజసభంగి భజించి భక్తి లో
కమ్ము తరింపగాఁ బరమ • కారుణికుల్ మునులాత్మనెంచి సా
రమ్మయి యొప్పునా ప్రథమ • రామపదంబున కిమ్మహాత్మ్య న
ర్థమ్ముగఁ జెప్పి రార్య విది • తంబగు స్వానుభవంబు పెంపునన్. 241

సీ. ప్రకృతితోఁడి పురుషుఁడు శ్రీ • రాముఁడనఁగఁ
బ్రకృతి పురుషభవంబు స • ర్వప్రపంచ
మేకకారణ మిర్వురి • దృశ్యమునకు
వారె యర్థంబు ప్రథమసో • పానమునకు. 242

ఉ. ఇంక ద్వితీయనామమున • కేర్పడు నర్థము నాలకింపు ని
శ్శంకమతిన్ వచింతునిదె! • సర్వజగంబుల కంతరాత్మయై
కొంకక సర్వభూతముల • కున్ హృదయాబ్జములందు నిల్చియా
తంక మొకింత లేక వివి • ధంబుల వృత్తులఁ గొల్పునిచ్చలున్. 243

ఆ. వె. జాగరంబునందు • సర్వేంద్రియానుగుం
డ చు స్వప్నమందు • నంతరంగ
వ త్ర మాశ్రయించి • మఱి సుషుప్తిని మనః
ప్ర యమున సర్వ • సాక్షి యగును. 244

[౯]

గీ. ఇంద్రియంబులు విషయంబు • లందు ద్రావు
మానసం బింద్రియంబుల • మరగి తిరుగు
మానసమున కధీశ్వరుం • డౌ సతంబు
అతండె విషయానుభవమున • కాశ్రయుండు. 245

చ. ఇరవుగ నిద్రవేళ సక • లేంద్రియముల్ తమ యాశ్రయంబులన్
దిరముగ విశ్రమింప నతి • ధీరత నిమ్మహనీయుఁ డొక్కరుం
డరుదుగ నంతరంగము న • హాయముగాఁ గొని దాని చాతురిన్
విరచితమౌ ప్రపంచమున • నిల్చియనేక విచిత్రముల్ గనున్. 246

సీ. చండ మధ్యాహ్నమా • ర్తాండమండలము వి
న్వీథి నఖండమై • వెల్గుచుండ
ధరణిఁ బ్రాక్పశ్చిమో • త్తర దక్షిణముల నల్
దిక్కులఁ బిక్కటి • ల్లిన మహాబ్ధి
నలిసలిపించు తి • న్నని పిల్లగాడ్పుల
గలమిన జిలిబిలి • యలలయందు
ఖద్యోతములపోల్కి • విద్యోతమానంబు
లవు సహస్రాంశు సం • శువులువోలె

గీ. జంగమస్థావరాత్మక • సకలజీవ
హృదయజలజమ్ములను వసి • యించుచుండు
వాసదేవుండె మధ్యసా • పానమైన
రామనామంబునకు సద • ర్థంబు వత్స! 247

ఉ. ఆరమణీయమూర్తి హృద • యంబున నిల్పుచు యోగులెల్ల సం
సార మహాంధకార భయ • సంతతి దూరవిచార ధీరులై
సారమతిప్రసారముల • సారెకు నిర్భరహర్ష బాష్పధా
రారుచిరాస్యులై భవవి • రాముని గాంతురు జంతుసంస్థులన్.

కం. గాయత్రీ మంత్రార్థం
బై యలరు నితండె యీ చ, రాచరములకున్
బాయక సర్వాంతరుఁడై
యేయెడఁ బ్రేరేచుఁ జిత్త • వృత్తులనెల్లన్. 249

గీ. అంధకారావృతంబులౌ • నఖిలహృదయ
గుహాలయందున నిల్చి య • న్వహమువెల్గు
నిశ్చలజ్ఞాన దీపమై • నెగడునతఁడు
భవనములఁ బ్రజ్వరిల్లు దీ • పంబువోలె 250

వ. ఇంకఁ దృతీయభూమికా ప్రభావంబు నభివర్ణింతు నాకర్ణింపుము. 251

సీ. ప్రకృతిపూరుషయోగ • భవములై విలసిల్లు
నామరూపంబు లిం • తయును లేక
మానససృష్టి వి • ధానచిత్రితములౌ
సంకల్ప సాదృ • శ్యములు లేక
తరళ జంఝామారు • తముల యుద్రేకంబు
గర్జితావళుల భీ • కరరవంబు
విశ్వసుందరమైన • విద్యుద్విలాసంబు
చాయ నిర్మలమౌ న • భంబు వోలె

గీ. వివిధ దృగ్దృశ్య దర్శన • విధులడంగ
నేకమై చిత్తవృత్తుల • కెనయగాక
రాకపోకలు లేక సా • రము వెల్గు
నిత్యకల్యాణ పదమిదే! నిర్మలాత్మ. 252

వ. అని యానతిచ్చినం దదీయ బోధామృత ప్రవాహంబున సంసార
దహన సంతాపంబు శాంతింప నంతర్హితాజ్ఞాన సంతమసస్వాంతుం
డనై, మాయిరువుర ప్రశ్నోత్తర మాలికాప్రబంధంబు నీకు నత్య

హారంబుగా సమర్పించితింగాన దీనిని నీహృదయంబున నవధరించి మమ్ముం గరుణాకటాక్షంబుల నిరీక్షించి పూజ్యంబగు నపవర్గ సామ్రాజ్యం బనుగ్రహించి రక్షింపు మివియే పదివేల వందనములు.

### ఆశ్వాసాంతము

క. సదయ మునిహృదయ సదనా
సదమలబోధావతార • సస్మితవదనా
ముదితపవమాననందన
హృదయాశ్రిత భయవిరామ • శ్రీరఘురామా. 254

### గద్య

ఇది శ్రీసుబ్రహ్మణ్య గురువరేణ్య పరమకారుణ్య
లహరీప్రవర్ధమాన బోధాంకురనిధాన
సత్యనారాయణాభిధానప్రణీతంబైన
శ్రీసద్గురు స్తవరాజంబునం
జిత్రబోధంబను నేకా
శ్వాసమ్ముతో
సర్వంబును
సంపూర్ణము
శ్రీ శ్రీ శ్రీ
శ్రీ శ్రీ
శ్రీ

Paper Supplied by M. J. M. Rao, E. G. No. 75, Copies 500.

# తప్పొప్పుల పట్టిక

| పుట | పద్యము | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|---|
| తొలిపలుకు | 1 | 2 | సాక్షా ప్రరంబ్రహ్మ | సాక్షాత్పరంబ్రహ్మ |
| 3 | 10 | 3 | మధ్యనాజ్ఞా | మధ్యగాజ్ఞా |
| 9 | 33 | 2 | వెలసెనో | ౘెలిసెనో |
| 9 | 35 | 1 | దగవ | దరువ |
| 9 | 35 | 1 | తగ | తగు |
| 9 | 36 | 1 | బోడు | బోక |
| 10 | 37 | 1 | దివినిండు | దివి నిండు |
| 13 | 45 | 10 | చీకటి | ౙీకటి |
| 15 | 53 | 3 | యుపవసించుటె | యుపవసించుట |
| 16 | 56 | 2 | దోచ | దోౘ |
| 20 | 69 | 2 | రణాళి | రాణాళి |
| 20 | 69 | 12 | విశ్వనాధ | విశ్వనాథ |
| 21 | 75 | 3 | గందములాదుల | గండమూలాదుల |
| 25 | 88 | 5 | నిందింప | నిందింపం |
| 25 | 89 | 4 | డంభోడు | డంభోధు |
| 37 | 142 | 1 | దైత్యవ వర్గము | దైత్యవర్గము |
| 38 | 146 | 3 | అంధకారకబు | అంధకారంబు |
| 41 | 156 | 8 | తనె ఉంగక | తన్నెఉంగక |
| 44 | 171 | 5 | ఉగ్రదంష్ట | ఉగ్రదంష్ట్ర |
| 51 | 193 | 3 | విమా మధ్య | విమానమధ్య |
| 61 | 227 | 5 | కటాక్షయుల | కటాక్షముల |
| 62 | 229 | 3 | నవితాత్మావలోక | నవిరతాత్మావలోక |

వెలకు దొరకు శ్రీ రెడ్డి వెంకట సుబ్రహ్మణ్య గురువర్యులచేఁ బ్రకటింపఁబడిన గ్రంథములు.

1. ఆత్మ బోధ ఆది శంకరాచార్యస్వామి ప్రణీత సంస్కృతాత్మబోధకు తెనుఁగు. 0—10—0
2. అచలపర వాసుదేవ శతకము భగవంతుని దర్శించి బ్రహ్మానుభూతి నొందగోరువారికి అవశ్య పఠనీయము 1—8—0
3. శ్రీ సద్గురు స్తవరాజము 1—8—0

అచ్చుకు సిద్ధముగా నున్నవి.

1. శ్రీ సద్గురు పూజావిధానము
2. శ్రీ సుబ్రహ్మణ్యగురుస్వామి చరిత్ర
3. శ్రీ సుబ్రహ్మణ్యగురుస్వామి-సగుణబోధ
4. శ్రీ సుబ్రహ్మణ్య శతకము

రచయిత: ఉభయభాషా ప్రవీణ లింగాల సూర్యనారాయణ

5. వేదాంత కీర్తనలు భక్తి, జ్ఞాన, వైరాగ్య, తత్త్వములను బోధించు మంగళహారతులు, జోలపాటలు, మేలుకొలుపులు మొదలగు వివిధములగు కీర్తనలు గలవు. స్త్రీ. పురుషు లందఱు నిత్యమును గానము చేయఁదగినవి.
6. సత్యనారాయణ వ్రతము సంస్కృతమునకుఁ దెలుఁగు.
7. అద్వైతరహస్యము భక్తి. జ్ఞాన. వైరాగ్య. బ్రహ్మానుభూతులనుఁదెల్పు స్వతంత్ర గ్రంథరాజము.
8. మానస బోధ
9. అష్టకములు
10. జనార్దనార్ధ శతకము.

5 మొదలు 10 వరకు శ్రీ రెడ్డి వెంకట సుబ్రహ్మణ్య గురుకృతములు.

రెడ్డి వెంకట సూర్యనారాయణ పరబ్రహ్మం అండ్ సన్సు.,
మహేంద్రవాడ, రామచంద్రపురం తాలూకా.
(తూర్పు గోదావరి జిల్లా)